ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
బుధవారం 22 జనవరి 2025


మాట్లాడుతున్న డీజీపీ ద్వారకా తిరుమలరావు, వేదికపై ఎస్పీ వి. రత్న

సాంకేతిక పరిజ్ఞానంతో సైబర్ నేరాలను నియంత్రిస్తాం

- జిల్లాకు ఒక సైబర్ క్రైం పోలీసు స్టేషన్ ప్రతిపాదన
- డీజీపీ ద్వారకా తిరుమలరావు

వివరాలు 7లో...

ఇష్టం లేకుంటే సెలవులో వెళ్లండి

సచివాలయ ఉద్యోగులపై మంత్రి సవిత ఆగ్రహం


మాట్లాడుతున్న మంత్రి సవిత

వివరాలు 7లో...

పాఠశాల కబ్జా చోరబడి

పశువుల పాకగా మార్చేసిన వైసీపీ నాయకులు


పాఠశాలలో వైసీపీ నాయకుల ఎద్దులు

వివరాలు 6లో...

టెంపుల్ టూరిజానికి ప్రాధాన్యం

కలెక్టర్ టీఎస్ చేతన్


పర్యాటక శాఖాధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తిటౌన్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో టెంపుల్ టూరిజం అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ భవనంలో పర్యాటక శాఖాధికారులతో కలెక్టర్ టెంపుల్ టూరిజం అభివృద్ధిపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో టెంపుల్ టూరిజం అభివృద్ధిపై సమగ్ర కార్యచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. పర్యాటక ప్రాజెక్టుల కోసం అవసరమైన భూములను గుర్తించి ప్రతిపాదనలను సిద్ధం చేయాలని పర్యాటక శాఖాధికారి జయకుమార్‌బాబును ఆదేశించారు. లేపాక్షిలో అదనపు గదులు, మరుగుదొడ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేసి, ఓపెన్ ఆడిటోరియం నిర్మాణ పనులు చేపట్టాలని తెలిపారు. గొల్లపల్లి రిజర్వాయర్‌లో బోట్ షికారుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. తనకల్లు మండలంలోని కోటపల్లి వద్ద నిర్మిస్తున్న రేస్ ట్రాక్, రిసార్ట్ పనులు నిర్ణీత సమయంలో పూర్తి చేయాలన్నారు. లేపాక్షి ఆలయం, జటాయువు, థీమ్ పార్కు, ఫుడ్‌కోర్టు, స్టాల్స్ కోసం దరఖాస్తులు ఆహ్వానించాలని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, జిల్లా అటవీశాఖాధికారి చక్రపాణి, పురావస్తు శాఖాధికారిణి రజిత, దేవదాయ శాఖ ప్రతినిధి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

హెల్మెట్‌తో ప్రాణాలు కాపాడుకోండి

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి: ఎస్పీ వి.రత్న


ర్యాలీలో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి రూరల్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి ప్రాణాలను కాపాడుకోవాలని ఎస్పీ వి.రత్న పిలుపునిచ్చారు. మంగళవారం సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి వద్ద రవాణా శాఖ ఆధ్వర్యంలో జాతీయ భద్రతా మాసోత్సవాల ఏక్తారన్ ర్యాలీని ఆర్టీఓ కరుణాసాగర్‌రెడ్డి, డీఎస్పీ విజయ్‌కుమార్‌తో కలిసి ఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. అధికారులు, కళాశాల విద్యార్థులు బ్యానర్లు, ప్లేకార్డ్స్‌తో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వద్ద ప్రారంభమైన ర్యాలీ వై జంక్షన్ వరకు కొనసాగింది. అనంతరం మానవహారంగా ఏర్పడి రోడ్డు ప్రమాదాల నివారణకై నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. యువత అతివేగం, ట్రాఫిక్ నియమాలు పాటించకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్లు ధరించకపోవడం వల్లే ప్రాణనష్టాలు సంభవిస్తున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి విలువైన ప్రాణాలు కాపాడుకోవాలన్నారు. కారులో ప్రయాణించేవారు సీట్‌బెల్టు ధరించాలన్నారు. మద్యం సేవించి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో ఎంవీఐ వరప్రసాద్, ఏఎంవీఐ ఉదయ్‌కుమార్, సీఐలు ఇందిర, సతీష్, మంగళకర కళాశాల ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా శేఖర్


శేఖర్‌ను అభినందిస్తున్న బీజేపీ నాయకులు

పుట్టపర్తి రూరల్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతాపార్టీ జిల్లా అధ్యక్షుడిగా గోరంట్ల మోహన శేఖర్ రెండోసారి ఎంపికయ్యారు. మంగళవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. జాతీయ కిసాన్‌మోర్చా ఉపాధ్యక్షుడు, ఆర్టీసీ రీజనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడిగా అధిష్ఠానం ఆదేశాల మేరకు రెండోసారి జీఎం శేఖర్‌కు పార్టీ పగ్గాలు అప్పగిస్తున్నట్లు ప్రకటించారు. గోరంట్లకు చెందిన జీఎం శేఖర్ ఇప్పటికే జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. మరోసారి ఆయనకు జిల్లా అధ్యక్షుడిగా పార్టీ పగ్గాలు దక్కాయి. ఆయన ఎంపికపట్ల పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా ఉన్న బీజేపీ నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

చైతన్య వేదిక

అశ్రునయనాల మధ్య బేడీకి అంతిమ వీడ్కోలు 7

యంగ్ ఇండియా

- నరేంద్రసింగ్ బేడీ అంకురార్పణ
- వ్యవసాయ కూలీల యూనియన్ల ఏర్పాటు
- మహిళలతో పరస్పర సహాయ సంఘాలు
- వేలాది ఎకరాల భూ పంపిణీ
- పేదరిక నిర్మూలనకు విశేష కృషి



మండల స్థాయి యూనియన్‌కు శిక్షణ ఇస్తున్న నరేంద్రసింగ్ బేడీ (ఫైల్)



యంగ్ ఇండియా.. నరేంద్రసింగ్ బేడీ.. ఈ రెండు పేర్లను వేరు చేసి చూడలేం. ఎక్కడో కోల్‌కతాలో జన్మించిన నరేంద్రసింగ్ బేడీ.. కరువు జిల్లాలో పేదరిక నిర్మూలన కోసం చేసిన కృషి అసమాన్యం. పేదలకు సహాయ చేయడం కన్నా.. పోరాటాల ద్వారా ప్రభుత్వం నుంచి హక్కులను సాధించుకునే విధంగా చైతన్యం కల్పించాలని భావించారు. వ్యవసాయ కూలీల యూనియన్లు, మహిళలతో పరస్పర సహాయ సంఘాలు ఏర్పాటు చేశారు. ఆ కోవలోనే ఎన్నో ప్రజాచైతన్య కార్యక్రమాలను నిర్వహించారు. వేలాది ఎకరాలను ప్రభుత్వం నుంచి పేదలకు పంపిణీ చేసేలా కృషి చేశారు. నేటి యువతరం కూడా ప్రశ్నించడం నేర్చుకోవాలన్నదే ఆయన సంకల్పం.


సంఘాల ఏర్పాటుపై సిబ్బందికి శిక్షణ ఇస్తున్న బేడీ (ఫైల్)

తనకల్లు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): యంగ్‌ఇండియా పేరు వినపడగానే ఉమ్మడి అనంతపురం జిల్లాతోపాటు, తెలంగాణలోని నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లో దశాబ్దాలపాటు చేసిన ఎన్నో సేవా, ప్రజాచైతన్య కార్యక్రమాలు గుర్తుకు వస్తాయి. నేడు కొనసాగుతున్న ఎన్నోపేరుగాంచిన స్వచ్ఛంద సంస్థల వ్యవస్థాపకులు ఒకనాడు నరేంద్ర సింగ్ బేడీ వద్ద పనిచేసి, అనుభవం గడిచించిన వారే. నేటికీ ఆయన స్ఫూర్తితో ఎన్నోసేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. అసంఘటిత కార్మికులను సంఘటితం చేసి, వారిలో చైతన్యం తీసుకురావడం ద్వారా పేదరిక నిర్మూలనతోపాటు సమస్యల పరిష్కారానికి చొరవ చూపవచ్చన్న బేడీ సిద్ధాంతాలు నేటికీ ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నాయి. నేటి యువతరం కూడా హక్కుల కోసం ప్రశ్నించడం నేర్చుకోవాలన్నదే ఆయన సంకల్పం. నరేంద్రసింగ్‌బేడీ 1939న జూలై 19న కోల్‌కతాలో సంపన్న కుటుంబంలో జన్మించారు. డెహరాడూన్, అమెరికాలో పేరుగాంచిన యూనివర్సిటీల్లో చదువుకున్నా రు. కెమికల్ ఇంజనీర్ అయిన ఆయన అమెరికాలో కొంతకాలంపాటు ఉద్యోగం చేశారు. ఆ సమయంలోనే అనంతపురం జిల్లాలో పని చేస్తున్న ఆర్డీటీ వ్యవస్థాపకుడు ఫాదర్‌ఫెర్రర్‌తో పరిచయమయింది. పేద ప్రజలకు సేవ చేయాలన్న సంకల్పంతో ఫెర్రర్‌తో కలిసి కొంతకాలం ప్రయాణించారు. అనంతరం 1970లో స్వంతగా యంగ్‌ఇండియా ప్రాజెక్టు అనే సంస్థను ఏర్పాటు చేశారు. పెనుకొండ ప్రాంతంలోని గుట్టూరు వద్ద ప్రభుత్వ స్థలాన్ని లీజుకు తీసుకుని సంస్థను నెలకొల్పారు. సంస్థ ద్వారా ఉమ్మడి బావుల పథకం, తాగునీటి పథకానికి బోర్లు వేయడం లాంటి కార్యక్రమాలు చేపట్టారు. ఇవి ఏమీ సమాజంలో మార్పు తీసుకురావడానికి ఉపయోపడడంలేదని గుర్తించారు. చట్టపరిధిలో ప్రజలను చైతన్యవంతులను చేసి, ప్రభుత్వాలను ప్రశ్నించడం ద్వారానే పేదరిక నిర్మూలన, సమస్యల పరిష్కారమవుతాయని భావించారు. ఆ కోవలోనే ఎన్నో ప్రజాచైతన్య కార్యక్రమాలను నిర్వహించారు. ఉపాధి, వ్యవసాయం, సంప్రదియేతర వనరుల వినియోగం, వనరుల సంరక్షణ, వికలాంగుల హక్కులు, మహిళలు, దళిత హక్కులు, భూసమస్యల పరిష్కారం, మహిళల పేరుమీద ఆస్తి(పట్టాలు) ఇలా అన్ని కోణాల్లోనూ ప్రజలను చైతన్యం చేయడానికి రాయసీమ జిల్లాలతోపాటు తెలంగాణలోని నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లో సంస్థ కార్యక్రమాలను విస్తరించారు. ప్రత్యేకించి భూ సమస్యల పరిష్కారంలో అనేక సవాళ్లను ఎదుర్కొన్నారు. భూ గరిష్ట పరిమితి పరిధిలో ప్రభుత్వానికి వదిలేవేసిన భూములను సైతం భూస్వాములు తమ వద్దనే బినామీ పేర్లతో ఉంచుకున్నారు. 1992-94 ప్రాంతంలో వీటిని వెలికితీసి వేలాది ఎకరాల భూములు పేదలకు దక్కేలా బేడీ కృషి చేశారు. ఉపాధి హామీ పథకం కాకుండా చట్టం రూపంలో రావాలని రాయలసీమ నాలుగు జిల్లాల నుంచి లక్ష సంతకాలతో అప్పటి కేంద్ర కార్మిక శాఖ మంత్రి గుడిసెల వెంకటస్వామిని కలిసి అనంతపురంలో వినతి పత్రాలను సమర్పించారు. అంతేకాకుండా రాయలసీమ, నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లోని అన్ని మండలాల నుంచి ఢిల్లీ వరకు సైకిల్ యాత్ర కొనసాగించి, కేంద్ర ప్రభుత్వం వద్ద ఉపాధి హామీ చట్టం విశిష్టతను తెలిపి, పథకం చట్టరూపం దాల్చేలా కృషిచేశారు. అసంఘటిత కార్మికులను సంఘటితం చేయడానికి రాయలసీమ జిల్లాలతోపాటు మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాల్లోని అన్ని మండలాల్లో వ్యవసాయకూలీల యూనియన్లు ఏర్పాటు చేశారు. జిల్లా యూనియన్లు, అన్నిజిల్లాలను కలుపుతూ రాష్ట్ర సమాఖ్యలు ఏర్పాటు చేసి ప్రజాగలం వినిపించారు. ఆనాడే మహిళలను సంఘటితం చేసి, పరస్పర సహాయ సంఘాలుగా అభివృద్ధి చెందాలన్న ఆకాంక్షతో పనిచేశారు. కూలీల కోసం ఆయన చేసిన పోరాటాలు ఎనలేనివి.

రైతు సంక్షేమమే కూటమి లక్ష్యం


రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లు అందజేస్తున్న నందమూరి బాలకృష్ణ

ఇతర రాష్ట్రాల మద్యం వస్తే కఠినంగా వ్యవహరిస్తాం

హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ

అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం

హిందూపురం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. నియోజకవర్గ పర్యటనలో భాగంగా మంగళవారం ఉదయం పట్టణంలో ప్రెస్‌క్లబ్‌కు వెళ్లి మొక్కలు నాటారు. లేపాక్షి, చిలమత్తూరు సబ్‌స్టేషన్‌ల వద్ద రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైసీపీ హయాంలో రైతుల బాధలు పట్టించుకోకుండా గాలికి వదిలేశారని విమర్శించారు. రైతు పేరు చెప్పడానికి కూడా వారికి అర్హత లేదన్నారు. రైతులే ఈ దేశానికి వెన్నెముక అన్నారు. దీనిని గుర్తించి నందమూరి తారకరామారావు ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయాలని అప్పట్లోనే హంద్రీనీవాకు బీజం వేశారని గుర్తు చేశారు. తెలుగు గంగ ద్వారా రాయలసీమకు నీరు ఇవ్వాలని సంకల్పించారని తెలిపారు. దానిని ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుకు తీసుకెళ్తున్నారని అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అక్రమ మద్యాన్ని అరికట్టడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. హిందూపురానికి ఎవరైనా ఇతర రాష్ట్రాల నుంచి మద్యం తీసుకొస్తే చర్యలు తీసుకునేందుకు పోలీసులకు స్వేచ్ఛ ఇచ్చామన్నారు. తూమకుంట పారిశ్రామికవాడలో ఈఎస్‌ఐ ఆసుపత్రితోపాటు కెమికల్ వాటర్ శుద్ధికి ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అన్నింటికి మించి చిలమత్తూరు, గోరంట్ల మండలాలకు నీరు ఇచ్చేందుకు లిఫ్ట్ ఇరిగేషన్ రూ.720కోట్లు ప్రతిపాదనలు వెళ్లాయని త్వరలోనే పనులు ప్రారంభించడానికి అవకాశం ఉందన్నారు. హెల్మెట్ ధరించి ద్విచక్రవాహనాన్ని నడిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాణంకన్నా విలువైంది ఏదీలేదన్నారు. ద్విచక్రవాహనం నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. కారులో ప్రయాణించేవారు సీటుబెల్టు పెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ కరుణాసాగర్‌రెడ్డి, సీఐలు రాజగోపాల్‌నాయుడు, ఆంజనేయులు, జనార్దన్, అబ్దుల్ కరీం, తహసీల్దార్ సౌజన్యలక్ష్మీ, ఎంపీడీఓ రమణ, ఇతరశాఖల అధికారులు పాల్గొన్నారు.

గిరిజన హక్కుల పరిరక్షణే కమిషన్ లక్ష్యం

జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్


సమావేశంలో మాట్లాడుతున్న కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్

పుట్టపర్తిటౌన్/కదిరి అర్బన్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): గిరిజన హక్కుల పరిరక్షణ కోసమే జాతీయ ఎస్టీ కమిషన్ పని చేస్తుందని కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా పర్యటనలో భాగంగా కదిరి, ముదిగుబ్బ మండలాల్లో పర్యటించిన అనంతరం పుట్టపర్తి చేరుకున్నారు. కలెక్టరేట్‌లో గిరిజన సంక్షేమంపై కలెక్టర్ టీఎస్ చేతన్, అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని పలు తండాల్లో ప్రజలు అనేక సమస్యలతో కొట్టుమిటాడుతున్నారని, వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. గిరిజనుల ఆరోగ్యం, సంక్షేమంతోపాటు వారి ఆర్థికాభివృద్ధికి అధికారులు చేయూతనివ్వాలని అన్నారు. అట్రాసిటీ చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలన్నారు. గిరిజనుల సంక్షేమానికి రూ.250కోట్లు నిధులు విడుదల చేసినట్లు చెప్పారు. అన్ని తండాల్లో రోడ్లు, విద్యుత్, తాగునీరు, గృహ నిర్మాణాలు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గిరిజన సమస్యల పట్ల నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్పీ వి.రత్న, అడిషనల్ ఎస్పీ శ్రీనివాసులు, డీఆర్‌ఓ విజయసారథి, ఆర్డీవోలు సువర్ణ, మహేశ్, వీవీఎస్ శర్మ, ఆనంద్, గిరిజన సంక్షేమాధికారి మోహన్‌రావుతోపాటు అన్నిశాఖల హెచ్‌ఓడీలు పాల్గొన్నారు. అంతకుముందు జాటోత్ హుస్సేన్ కదిరి లక్ష్మీనరసింహస్వామిని, ఎర్రదొడ్డి వద్ద వెలసిన గంగమ్మను దర్శించుకున్నారు. అనంతరం రామదాసునాయక్ తండా, బొడేనాయక్‌తండా, మీటేనాయక్‌తండాలో పర్యటించారు. ప్రజల నుంచి పలు వినతులు స్వీకరించారు. అధికారులు మానవతా దృక్పదంతో వ్యవహరించి, వివాదం లేని భూములకు పట్టాలు మంజూరు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో వీవీఎస్ శర్మ, తహసీల్దార్ మురళీక్రిష్ణ, ఎంపీడీఓ పోలప్ప, ఆల్‌ఇండియా బంజార సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి చక్రేనాయక్, జిల్లా కార్యదర్శి కాలేనాయక్ పాల్గొన్నారు.

అన్నదాతకు అండగా ఉంటాం

మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిర టౌన్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): నష్టాల్లో ఉన్న వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి అన్నదాతకు అండగా నిలవడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. మంగళవారం విద్యుత్ శాఖ కార్యాలయ ఆవరణంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామితో కలిసి వంద ట్రాన్స్‌ఫార్మర్లను రైతులకు పంపిణీ చేశారు. లోటల్టేజీ ద్వారా రైతులు తాము పెట్టిన పంటలు కోల్పోయే పరిస్థితి నుంచి ఆదుకోవడమే లక్ష్యంగా ట్రాన్స్‌ఫార్మర్‌లను పంపిణీ చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బాధ్యతలు స్వీకరించాక ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతమయిందని, రైతు ఖాతాలో 48 గంటల్లో నగదు జమచేసిన ఘనత ఎన్‌డీఏ ప్రభుత్వందే అన్నారు. ఆర్‌అండ్‌బీ అతిథిగృహం ఆవరణంలో 16 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.19 లక్షల చెక్కులను అందించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసమూర్తి, ఉమేష్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.


రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లు అందిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

చెస్ చాంపియన్.. స్టీఫెన్



బహుమతి అందుకుంటున్న శామ్యూల్ స్టీఫెన్‌నోబుల్

జిల్లాకు చెందిన శామ్యూల్ స్టీఫెన్ నోబుల్ నేషనల్ చెస్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నాడు. ఆంధ్రాచెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా కాకినాడలో నిర్వహిస్తున్న నేషనల్ స్కూల్స్ చెస్ చాంపియన్‌షిప్-2025 పోటీలు ముగిశాయి. 28 రాష్ట్రాల నుంచి సుమారు 1200మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన శామ్యూల్ స్టీఫెన్ నోబుల్ 9మ్యాచ్‌లు ఆడి 7 మ్యాచ్‌లో గెలుపొంది ఈ చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నాడు. అతిథుల చేతుల మీదుగా ట్రోఫీ, నగదు బహుమతి అందుకున్నాడు. విజేతను ఆల్ అనంతపూర్ చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు శివకుమార్, గౌరవాధ్యక్షుడు బాలరాజు, కోశాధికారి కిశోర్, ఇంటర్నేషనల్ ఆర్బిటార్ ఉదయ్‌కుమార్ నాయుడు, కోచ్ హుస్సేన్‌ఖాన్‌లు అభినందించారు. **- ఆంధ్రజ్యోతి, అనంతపురం క్లాక్‌టవర్**

రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపిక

రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలలో పాల్గొనే జూనియర్ క్రీడాకారుల ఎంపిక పోటీలు మంగళవారం అనంతపురంలో నిర్వహించారు. ఎంపికైనవారి వివరాలను జిల్లా ఆర్చరీ అసోసియేషన్ కార్యదర్శి శివకుమార్ తెలిపారు. బాలికల విభాగంలో వందన, మాన్విత, తరుణిక, రక్ష, జస్మిత, షణ్ముఖసాయిప్రియ ఎంపికయ్యారు. బాలుర విభాగంలో పవన్ కేశవరెడ్డి, యజ్ఞరూప్ యాదవ్, గురువర్ధన్, మహ్మద్ ఆయాన్, సాయి, జయదీప్‌సాయి, దాదా సలామాన్‌లు ఎంపికయ్యారు. వీరు ఈనెల 23 నుంచి విజయవాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. **- ఆంధ్రజ్యోతి, అనంతపురం క్లాక్‌టవర్**

గీత కార్మికులకు మద్యం దుకాణాలు

అనంతలో 14, శ్రీ సత్యసాయి జిల్లాలో 9 కేటాయింపు

అనంతపురం అర్బన్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం కల్లుగీత కార్మికులకు ప్రైవేటు మద్యం దుకాణాలను కేటాయిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. అనంతపురం జిల్లాలో 14, శ్రీసత్యసాయి జిల్లాలో 9 ప్రైవేటు మద్యం దుకాణాలను ఈడిగ, గౌడ వర్గాలకు కేటాయించాలని నిర్ణయించారు. ఈ మేరకు ఎక్సైజ్ శాఖ అధికారులకు అధికారికంగా సమాచారం అందింది. దరఖాస్తు ఫీజు (నాన్‌రిఫండబుల్) రూ.2లక్షలుగా నిర్ణయించారు. అయితే లైసెన్స్ ఫీజు విషయంలో ప్రభుత్వం మినహాయింపునిచ్చింది. ఒక్కో దుకాణానికి 50 శాతం మాత్రమే లైసెన్స్ ఫీజు వసూలు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈనెల 27 నుంచి ఫిబ్రవరి 5 వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ఫిబ్రవరి 7న లాటరీ తీయాలని నిర్ణయించారు.

ఏఐటీయూసీ జిల్లా వర్క్‌షాప్

వచ్చే నెల 22 నుంచి నిర్వహణ

అనంతపురం విద్య, జనవరి 21(ఆంధ్రజ్యోతి): కార్మిక సమస్యలపై ఫిబ్రవరి 22 నుంచి ఏఐటీయూసీ జిల్లా స్థాయి వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి పేర్కొన్నారు. ఆ సంఘం కార్యాలయంలో వర్క్‌షాప్ పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కార్మిక, ఉద్యోగ సమస్యలు రోజురోజుకు పెరిగిపోతున్నా యన్నారు. ఎన్ని పోరాటాలు చేసినా ప్రభుత్వాలు సమస్యలు పరిష్కరించడం లేదన్నారు. ఉద్యోగులకు భద్రత కల్పించడం మానేసి అవుట్ సోర్సింగ్ వ్యవస్థను ప్రోత్సహిస్తున్నారన్నారు. 20 ఏళ్లుగా అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని ఉద్యమాలు చేస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. సమస్యలపై కార్మికుల్లో అవగాహన తేవడానికి, చైతన్యం నింపడానికి వర్క్‌షాప్ పెట్టినట్లు తెలిపారు. వచ్చే నెల 22, 23, 24 తేదీల్లో వర్క్‌షాప్ ఉంటుందన్నారు. కార్మికులు జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు రాజేష్ గౌడ్, ప్రధానకార్యదర్శి కృష్ణుడు, నగర అధ్యక్షులు చిరంజీవి, ఇతర నాయకులు రాజు, బాషా, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

వరిం చేలా

పలు ప్రాంతాల్లో జోరుగా వరిసాగు



నీరుంటే చాలు పుడమి కడుపున రైతులు బంగారం పండిస్తారు. సేద్యంలో తరిస్తూ జీవజాతికి కడుపునింపుతారు. ప్రస్తుతం జిల్లాలోని పలు ప్రాంతాల్లో నీరు సమృద్ధిగా ఉండటంతో రైతులంతా పంటల సాగులో నిమగ్నమయ్యారు. కొన్ని చోట్ల ట్రాక్టర్లతో వరిమడిని సిద్ధం చేస్తుండగా, కూలీలు నాట్లు వేస్తున్నారు. మరికొన్ని చోట్ల వేరుశనగ సాగు చేస్తున్నారు. ముఖ్యంగా నాలుగేళ్ల తర్వాత బీటీపీకి నీరు రావడంతో చివరి ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అలాగే కణేకల్లు చెరువు కింద రెండో పంటకు సరిపడా నీరు ఉండటంతో రైతులు వరి సాగులో బిజీబిజీగా ఉన్నారు.

- సేద్యం చేస్తూ.. నాట్లు వేస్తున్నరైతులు
- చివరి ఆయకట్టుకు నీరు వస్తుందన్న ఆశాభావం
- నీటితో కళకళలాడుతున్న రిజర్వాయర్లు, చెరువులు
- ఉత్సాహంగా సేద్యం పనుల్లో అన్నదాతలు

కణేకల్లు చెరువు కింద రెండో పంట సాగు

● ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వం ● రెండో పంటగా వరి

కణేకల్లు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీచిక్కణ్ణేశ్వర వడయార్ చెరువు కింద రెండో పంటగా వరిని సాగు చేస్తున్నారు. కణేకల్లుతో పాటు గంగులాపురం, రచ్చుమర్రి తదితర ప్రాంతాల రైతులు వరి సాగును ప్రారంభించారు. ఈ చెరువు కింద రబీసీజన్‌లో దాదాపు మూడు వేల ఎకరాలలో వరిపంటను సాగుచేస్తున్నారు. గతంలో రెండోపంటకు నీటి సమస్యలు ఏర్పడేవి. కానీ ఈ ఏడాది కణేకల్లు చెరువులో పుష్కలంగా నీరు ఉండటంతో రైతులంతా ఉత్సాహంగా పంటసాగుకు సిద్ధమయ్యారు. ఎన్నికల ముందు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తాను గెలిచి, కూటమి పార్టీలు అధికారంలోకి వస్తే కణేకల్లు చెరువు కింద రెండో పంటకు కూడా నీరు ఇస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. తుంగభద్ర డ్యాంలోకి నీటిరాక ప్రారంభమైనప్పటి నుంచి హెచ్చెల్సీ అధికారులతో ముందస్తు ప్రణాళికలు చేయించి రెండో పంటకు అవసరమైన నీటిని కణేకల్లు చెరువులో నిల్వ ఉంచేలా చర్యలు తీసుకున్నారు. దీంతో రైతులు కూడా రెండోపంటకు సమాయత్తం అవుతూ ఇప్పటికే నాట్లు కూడా వేసుకుంటున్నారు.


కణేకల్లు చెరువు

సంతోషంగా ఉంది



రెండో పంటకు మా భూముల్లోకి సాగునీరు రావడం చాలా సంతోషంగా ఉంది. ఇటీవలే మాకున్న 1.5 ఎకరాల పొలంలో పండించిన ధాన్యాన్ని విక్రయించాం. వెంటనే రెండో పంటకు కూడా నీరు అందుబాటులో ఉండటంతో పంటసాగుకు సమాయత్తం అవుతున్నాం.

- రవి, రైతు, గంగలాపురం

రైతులందరికీ ఉపయోగం



ఈ ప్రాంతంలో వరిపంటే ప్రముఖంగా పండిస్తున్నాం. నాకు 70 సెంట్ల భూమి మాత్రమే ఉంది. అయితే ఏడాదిలో రెండు పంటలు సాగు చేసే అవకాశం రావడంతో ఇతర పనులకు వెళ్లకుండా వ్యవసాయాన్ని నమ్ముకుని గౌరవంగా జీవించే అవకాశం ఏర్పడింది. **- ఖాసీం, రైతు, కణేకల్లు**




శింగనమల ఆయకట్టు భూముల్లో సేద్యం పనులు చేస్తున్న రైతులు

2 వేల ఎకరాల్లో...

శింగనమల: శింగనమల శ్రీరంగరాయ చెరువు ఆయకట్టులో రెండు వేల ఎకరాల్లో వరిసాగుకు రైతులు సిద్ధమయ్యారు. ఈచెరువు కింద అధికారికంగా 2500 ఎకరాలు, అనధికారికంగా మరో 2500 ఎకరాల భూములు ఆయకట్టుగా సాగవుతున్నాయి. అయితే గత పదేళ్లలో ఇలా ఎక్కువ స్థాయిలో ఆయకట్టును సాగు చేసిన పరిస్థితి లేదు. బోరుబావుల కింద మరో 1500 ఎకరాల్లో కూడా వరి సాగుకు రైతులు సిద్ధం చేస్తున్నారు. నీరు వృథా చేయకుండా వాడుకుంటే చివరి ఆయకట్టు కూడా సస్యశ్యామలం అవుతుందని రైతులు చెబుతున్నారు. లేకుంటే చివరి ఆయకట్టు భూములు ఉన్న సోదనపల్లి, పొతురాజుకాల్వ, చక్రాయపేట గ్రామాలకు నీరు వెళ్లడం కష్టమవుతుంది.

నీరు సరిపోతుంది


వరినాట్ల కోసం మడిని సిద్ధం చేస్తున్నరైతు



చెరువులో పంట సాగుకు అవసరమైన నీరు ఉంది. నీరు సరిపోతుందనే నమ్మకంతోనే పంటలు సాగు చేస్తున్నాం. ఒకవేళ పంట చివరి దశలో నీరు తక్కువ వస్తే ఎమ్మెల్యే విడుదల చేయిస్తారనే నమ్మకం ఉంది.

- మాసూద్‌వలి(మోదు), రైతు, శింగనమల

దేవుడి మీద భారమేసి..



చెరువులో నీరు నిండుగా ఉంది. అందుకే దేవుడిపై భారం వేసి పంట సాగు చేస్తున్నాం. పంటలకు సాగు నీటి సమస్య రాదనే అనుకుంటున్నాం. భూమి తల్లి రైతులను ఎప్పుడూ మోసం చేయదు. దిగుబడి కూడా బాగా వస్తుందని నమ్మకంగా సాగు చేస్తున్నాం.

- తిరుపాలు, రైతు, శింగనమల


యర్రంపల్లి వద్ద ఆయకట్టులో వేరుశనగ సాగు

4 ఏళ్ల తర్వాత..

గుమ్మఘట్ట: నాలుగేళ్ల తర్వాత బీటీపీకి పూర్తి స్థాయిలో నీరు చేరడంతో ఎడమ కాలువ కింద 3500 ఎకరాలు, కుడికాలువ కింద 2600 ఎకరాలకు సాగునీటిని విడుదల చేశారు. దీంతో ఆయకట్టు రైతులు పంటల సాగులో బిజీబిజీగా కనిపిస్తున్నారు. రంగచేడు, ఎర్రంపల్లి, నేత్రపల్లి గ్రామాల పరిధిలో పదిరోజులుగా వరి, వేరుశనగ సాగులో రైతులు నిమగ్నమయ్యారు. డిసెంబరు చివరిలో సాగునీరు విడుదల కావడంతో ముందస్తుగా బోర్ల కింద నార్లు పోసుకొని ప్రస్తుతం కొంత మంది రైతులు నాట్లు వేసుకుంటుండగా మరికొంతమంది వేరుశనగ సాగు చేస్తున్నారు. మిగతా భూములను సాగుకు సిద్ధం చేసుకుని నార్లు పోసుకుంటున్నారు. 15వ డిస్ట్రిబ్యూటరీ నుంచి 17వ డిస్ట్రిబ్యూటరీ వరకు చివరి ఆయకట్టుకు నేరుగా సాగునీరు అందిస్తుండటంతో రైతులు పంటల సాగుకు ఎటువంటి ఇబ్బందులు ఉండవని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆనందంగా ఉంది - ఆంజనేయులు, రైతు, రంగచేడు



నాలుగేళ్లగా చివరి ఆయకట్టు భూములు నీళ్ల లేక బీళ్లుగా ఉండేవి. ప్రస్తుతం నీరు సమృద్ధిగా విడుదల చేస్తుండటంతో పచ్చ ని చేలుగా మారుతున్నాయి. చివరి ఆయకట్టు రైతులకు కూడా పంటలు పండించుకునే అవకాశం దొరకడం ఆనందంగా ఉంది.

బోరుబావుల్లో పుష్కలంగా నీరు: కంబరి మారెన్న, రైతు, రంగచేడు



బీటీపీ కాలువ నీరు ఆయకట్టుకు పారుతుండటంతో మా పొలాల్లోని బోరుబావులు రీచార్జ్ అవుతున్నాయి. బోరుబావుల్లో నీరు పుష్కలంగా వస్తోంది. అందుకే ముందస్తుగానే వరినారు పోసుకొని నాట్లు వేసేందుకు సిద్ధమయ్యాం. మరో మూడేళ్ల పాటు బోరుబావుల్లో పుష్కలంగా నీరు వస్తాయి.

చౌరబడి

పాఠశాల కబ్జా

పశువుల పాకగా మార్చేసిన వైసీపీ నాయకులు









పాఠశాల ప్రధాన దారికి ముళ్ల కంపలు అడ్డుగా వేసిన వైసీపీ నాయకులు

పాఠశాలలో పశువులను కట్టేసిన వైసీపీ నాయకులు

గ్రామ కంఠం అంటూ అధికారులు ఇచ్చిన సర్టిఫికెట్(స్కెచ్)

విడపనకల్లు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుల ఆగడాలు, ఆక్రమణలు ఇప్పటికీ ఆగటంలేదు. ఉండబండ గ్రామంలో ఇద్దరు వైసీపీ నాయకులు వినియోగంలో లేని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆక్రమించుకున్నారు. అందులో తమ పశువులను, గొర్రెలను, వ్యవసాయ పనిముట్లను ఉంచుతున్నారు. గ్రామంలో 1 నుంచి 5వ తరగతి వరకూ ప్రాథమిక పాఠశాల ఉండేది. విద్యార్థులు ఎక్కువ కావటంతో దాన్ని ఎంపీయూపీ పాఠశాలగా అప్‌గ్రేడ్ చేశారు. 2012 నుంచే ఎంపీ యూపీ పాఠశాల ప్రారంభం అయింది. ఊరి చివరన అదనపు గదులను నిర్మించి పాఠశాలను అక్కడికి తరలించారు. దీంతో గ్రామం నడిబొడ్డున ఖాళీగా ఉన్న ప్రాథమిక పాఠశాల లో అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్వహించేవారు. అయితే గ్రామానికి చెందిన అన్నతమ్ములైన వైసీపీ నాయకులు పల్లే రామలింగ, పల్లే పెద్ద లింగప్ప 2020లో అంగన్‌వాడీ కేంద్రాలను ఖాళీ చేయించి ప్రాథమిక పాఠశాలను తమ ఆధీనంలోకి తీసుకున్నారు. పాఠశాలలోకి ఎవరూ వెళ్లకుండా ప్రధాన దారికి ముళ్ల కంపలు కొట్టి బంద్ చేశారు. దీనిపై మండల అధికారులు నోటీసులు జారీ చేసినా ఆక్రమణదారుల్లో బెరుకు లేకుండా పోయింది. ఇది మాదే అంటూ అధికారులతోను, పోలీసులతోనే వాదిస్తున్నారు. సర్వే నంబరు 151లో డైక్లాట్‌లోను ఈ స్థలం గ్రామ కంఠం అని ఉందని రెవెన్యూ అధికారులు తేల్చారు. ఆక్రమించుకున్న పాఠశాలను ఖాళీ చేసి ప్రభుత్వ అధికారులకు స్వాధీనం చేయాలని రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేసినా ఫలితం లేదు. వచ్చే ఏడాది గ్రామానికి జడ్పీ ఉన్నత పాఠశాల వస్తోందని, సరిపడ తరగతి గదులు లేకపోతే విద్యార్థులు ఇబ్బంది పడతారని పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ హెచ్‌పీ రాజు పేర్కొన్నారు. పాత స్కూల్ గదులను ఖాళీ చేస్తే మరమ్మతులు చేయించి 1 నుంచి 5 తరగతులు ఇక్కడే నిర్వహించేలా చూస్తామన్నారు. ఎంఈఓ శ్రీనివాసులు మాట్లాడుతూ పాఠశాలను ఆక్రమించుకున్న వారికి ఖాళీ చేయాలని ఎన్ని సార్లు చెప్పినా వినిపించుకోవడం లేదన్నారు. వారం కిందట కూడా నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. జిల్లా అధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి తప్పకుండా ఖాళీ చేయిస్తాం. దీనిపై తహసీల్దార్ సునితీబాయి మాట్లాడుతూ పాత పాఠశాల ఉన్న స్థలం మొత్తం సర్వే నంబరు 151లోని గ్రామ కంఠం అన్నారు. దీనిపై ప్రైవేట్ వ్యక్తులకు ఎలాంటి అధికారం లేదన్నారు.

ఏ పంట పెట్టినా

ఇంతేనా..!

భారీగా తగ్గిన కంది దిగుబడి
అరకొర ధరలతో అన్నదాత కుదేలు




తగ్గుపర్తిలో యంత్రం ద్వారా గ్రేడింగ్ చేస్తున్న రైతులు


యంత్రాలతో కందిపంట కోస్తున్న రైతులు

బెళుగుప్ప, జనవరి 21(ఆంధ్రజ్యోతి): వాతావరణం అనుకూలించకపోవడంతో ఈ ఏడాది కంది పంట దిగుబడి బాగా తగ్గిపోయింది. దీంతో రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. మండల వ్యాప్తంగా 17,616 ఎకరాలలో ఈ ఏడాది కంది పంట సాగుచేశారు. ఎర్రనేల భూముల్లో సాగుచేసిన పంట కాస్తో కూస్తో దిగుబడి వచ్చినా, నల్లరేగడి భూముల్లో సాగు చేసిన రైతులకు నష్టాలే మిగిలాయి. అననుకూల వాతావరణంలో పంటకు తెగుళ్లతో పాటు పచ్చపురుగు విపరీతంగా ఆశించింది. నివారణకు వేలాది రూపాయలు వెచ్చించి పురుగు మందులు పిచికారీ చేసినా ఫలితం లేకుండాపోయిందని పలువురు రైతులు వాపోతున్నారు. గతంలో మూడు దఫాలు క్రిమిసంహారక మందులు పిచికారీ చేస్తే మంచి దిగుబడితో పంట చేతికొచ్చేదని, ఈ ఏడాది ఐదు నుంచి ఆరుసార్లు పిచికారీ చేసిన దిగుబడి మాత్రం ఎకరాకు మూడు క్వింటాళ్లలోపే వచ్చింది. ప్రస్తుతం ధర కూడా తగ్గుతోంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గతంలో రూ.తొమ్మిది వేల నుంచి పది వేలు వరకు ధర ఉండగా ఇప్పుడు రూ. ఆరు వేలకు దిగివచ్చింది. ఎకరా కంది సాగు చేయడానికి సేద్యం, విత్తనాలు, పురుగుమందులు, కోతలు, కూలీలు తదితర ఖర్చులు కలుపుకుని రూ.15 వేలకు పైగా పెట్టుబడి అవుతుందని రైతులు చెబుతున్నారు. పంటబాగా పండి ఉంటే ఎకరాకు ఆరేడు క్వింటాళ్ల దిగుబడి వచ్చేదని, ప్రస్తుతం మూడు క్వింటాళ్లు కూడా రాకపోవడం, ధర కూడా లేకపోవడంతో నష్టాలు తప్పని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలంటూ కోరుతున్నారు.

ఎకరాకు రెండు క్వింటాళ్లే..



ఎంతో ఆశతో 15 ఎకరాలు కౌలుకు తీసుకుని కంది పంట సాగుచేయగా ఎకరాకు రెండు క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. మొత్తం 30 క్వింటాళ్లు అయ్యాయి. పెట్టుబడి ఎక్కువ... దిగుబడి తక్కువ రావడంతో దిక్కుతోచడం లేదు. వచ్చిన నష్టాన్ని ఎలా పూడ్చుకోవాలో తెలియడం లేదు. **- నాగరాజు, రైతు, తగ్గుపర్తి**

నిరాశాజనకంగా దిగుబడి



వాతావరణం అనుకూలించకపోవడంతో కంది పంటలో ఆశించిన దిగుబడులు రాలేదు. పెట్టుబడి ఒక ఎకరాకు రూ. 15 వేలు పెట్టాము. దిగుబడి మాత్రం మూడు క్వింటాళ్లలోపే వస్తోంది. గిట్టుబాటు ధర కూడా లేదు. క్వింటాల్‌కు రూ. 6500లకు వ్యాపారులు అడుగుతున్నారు. గిట్టుబాటు ధర వస్తేనే రైతులు గట్టెక్కేది.

- ఎర్రిస్వామి, రైతు, ఎర్రగుడి

న్యూస్ బాక్స్

24లోపు కాంప్లెక్స్ ప్రక్రియ పూర్తి చేయండి

● డీఈఓ ప్రసాద్‌బాబు

అనంతపురం విద్య, జనవరి 21(ఆంధ్రజ్యోతి): స్కూల్ కాంప్లెక్స్ పునర్నిర్మాణ ప్రక్రియను ఈనెల 24లోపు పూర్తి చేయాలని డీఈఓ ప్రసాద్‌బాబు ఆదేశించారు. స్థానిక పంగల్‌రోడ్డులోని ఆర్డీటీలో బ్లైండ్ స్కూల్ ఆడిటోరియంలో అనంతపురం, సత్యసాయి జిల్లాల ఎంఈఓలతో స్కూల్ కాంప్లెక్స్‌ల పునర్నిర్మాణంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ... ప్రతి ఎంఈఓ తమ మండలంలోని కాంప్లెక్స్‌లు, స్కూళ్ల గురించి క్షుణ్ణంగా అవగాహన చేసుకుని ఉండాలన్నారు. ఈ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకూడదన్నారు. కమిషనర్ మీటింగ్ నాటికి అన్ని అంశాలతో సిద్ధంగా ఉండాలని సూచించారు. తర్వాత డిప్యూటీ డీఈఓ శ్రీదేవి, శ్రీనివాసులు, ఎంఈఓ జయచంద్ర63 మండలాల విద్యాశాఖాధికారులతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 360 స్కూల్ కాంప్లెక్స్‌ల పునర్నిర్మాణం కసరత్తు చేయించారు. కార్యక్రమంలో డీసీఈబీ కార్యదర్శి గంధం శ్రీనివాసులు, విద్యాశాఖ అధికారులు, సమగ్రశిక్ష సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.

నేడు 10వ అల్ట్రామారథాన్

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): 10వ ఎడిషన్ అల్ట్రా మారథాన్ బుధవారం బెళుగుప్ప మండలం వెంకటాద్రిపల్లి నుంచి ప్రారంభించనున్నట్లు ఆర్డీటీ అధికారులు తెలిపారు. వెంకటాద్రిపల్లిలో సాయంత్రం 6గంటలకు అల్ట్రా మారథాన్‌ను ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచో ఫెర్రర్ జెండా ఊపి ప్రారంభించనున్నారు. 23న సాయంత్రం బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రి వరకు 170కిలో మీటర్లు మారథాన్ సాగనుంది.

గురుకుల విద్యకు దరఖాస్తు చేసుకోండి

యల్లనూరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఏకలవ్య గురుకుల పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ చంద్రశేఖర్ తెలిపారు. 2025-26 సంవత్సరంలో ఆరో తరగతి ప్రవేశానికి ఫిబ్రవరి 19లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు చేసుకొనే విద్యార్థులు ఏదైనా ప్రభుత్వ లేక ప్రభుత్వ గుర్తింపు పొందిన విద్య సంస్థల్లో 5వ తరగతి చదివి ఉండాలన్నారు. గురుకుల పాఠశాలల్లో పూర్తి ఇంగ్లీషు మీడియం ఉంటుందని వివరించారు.

క్రైం న్యూస్

పోక్సో కేసులో ఐదేళ్ల జైలు

అనంతపురం క్రైం, జనవరి21 (ఆంధ్రజ్యోతి): బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన కేసులో గుంతకల్లు పట్టణం తిలక్‌నగర్‌కు చెందిన షేక్ షెక్షావలి అలియాస్ అంగడి వలికి కోర్టు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధించింది. ఈ మేరకు పోక్సో కోర్టు జడ్జి రాజ్యలక్ష్మి మంగళవారం తీర్పు వెలువరించారు. బాధితురాలికి రూ.రెండు లక్షల నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. గుంతకల్లు పట్టణం తిలక్‌నగర్‌కు చెందిన షెక్షావలి స్థానికంగా అంగడి పెట్టుకుని వ్యాపారం చేసేవాడు. 2020 జనవరి 16న ఏడేళ్ల బాలిక చాక్లెట్ కొనుక్కోవడానికి ఆ అంగడికి వెళ్లింది. బాలికకు మాయమాటలు చెప్పిన ముద్దాయి తన అంగడి లోపలికి పిలిచి, ఒడిలో కూర్చోబెట్టుకుని అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో బాలిక భయపడి గట్టిగా అరచి, పరిగెత్తుకెళ్లి తల్లికి చెప్పింది. ఏం జరిగిందో తెలుసుకున్న తల్లిదండ్రులు గుంతకల్లు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి సీఐ చిన్న గోవిందు కేసు నమోదు చేశారు. డీఎస్పీ ఖాసీం సాబ్ కేసు దర్యాప్తు చేసి పోక్సో కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. ఈ కేసులో 14మంది సాక్షులను విచారించారు. నేరం రుజువు కావడంతో షెక్షావలికి శిక్ష విధించారు. స్పెషల్ పీపీ ఈశ్వరమ్మ ప్రాసిక్యూషన్ తరపున వాదించారు. సాక్షులను సకాలంలో కోర్టుకు హాజరుపరిచి ముద్దాయికి శిక్ష పడేలా చేసిన కోర్టు మానిటరింగ్ సిస్టం వెంకటేష్‌నాయక్, గుంతకల్లు టూటౌన్ సీఐ మస్తాన్, కోర్టు లైజర్ ఆఫీసర్, ఏఎస్ఐ శ్రీనివాసులు కోర్టు కానిస్టేబుల్ ప్రీనివాసులు, నాగార్జున, ఊదానాయక్‌లను జిల్లా ఎస్పీ జగదీష్ అభినందించారు.

టెక్నాలజీతో సైబర్ నేరాలను నియంత్రిస్తాం

● జిల్లాకు ఒక సైబర్ క్రైం పోలీసు స్టేషన్ ప్రతిపాదన

● డీజీపీ ద్వారకా తిరుమలరావు



సత్యసాయి మహాసమాధిని దర్శించుకుంటున్న డీజీపీ

పుట్టపర్తి రూరల్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ఆధునిక శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానంతో అన్నిరకాల నేరాల నియంత్రణకు శాయశక్తులా కృషిచేస్తున్నామని రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావు పేర్కొన్నారు. సత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని జిల్లా పోలీసు కార్యాలయంలో అనంతపురం రేంజ్ డీఐజీ షిముషి, ఎస్పీ వి.రత్నతో కలసి మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపులో ఉన్నాయని అన్నారు. సైబర్ నేరాలు కొంత పెరిగాయని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వాటి నియంత్రణకు చర్యలు తీసుకుంటామన్నారు. ఏపీని గంజాయిరహిత రాష్ట్రంగా మారుస్తామని అన్నారు. రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలు మానవ తప్పిదాల కారణంగానే జరుగుతున్నట్లు గుర్తించామని అన్నారు. జిల్లాకు ఒక సైబర్ క్రైం పోలీసు స్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపామని, అది ప్రస్తుతం ప్రభుత్వ పరిశీలనలో ఉందని డీజీపీ పేర్కొన్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో 2024 క్రైం వార్షిక నివేదికపై డీజీపీ సంతృప్తి వ్యక్తం చేశారు. నేరాల అదుపునకు చర్యలు తీసుకున్న ఎస్పీని, పోలీసు సిబ్బందిని అభినందించారు. సత్యసాయి జిల్లాలో ఇటీవల జరిగిన గ్యాంగ్ రేప్, మడకశిరలో బాలుడి హత్య కేసును 26 సంవత్సరాల తర్వాత ఛేదించడం, శాంతిభద్రతలు నేరాల నియంత్రణలో జిల్లా పోలీసుశాఖ పురోగతి సాధించిందని డీజీపీ ప్రశంసించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, డీఎస్పీలు విజయ్‌కుమార్, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, ఎస్బీ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, ఎస్బీ ఎస్ఐ ప్రదీప్‌కుమార్, డీసీఆర్బీ సీఐ శ్రీనివాసులు ఆర్ఐలు వలి, మహేష్ పాల్గొన్నారు.

సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్న డీజీపీ

డీజీపీ ద్వారకా తిరుమలరావు పుట్టపర్తి ప్రశాంతి నిలయంలోని సత్యసాయి మహా సమాధిని మంగళవారం దర్శించుకున్నారు. బెంగుళూరు నుంచి రోడ్డుమార్గాన పుట్టపర్తి పోలీసుగెస్టుహౌస్ చేరుకున్న ఆయనకు అనంతపురం రేంజ్ డీఐజీ షిముషి, ఎస్పీ రత్న పుష్ప గుచ్ఛాలు అందచేసి స్వాగతం పలికారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం ఆయన ప్రశాంతి నిలయం చేరుకున్నారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్టు వర్గాలు ఆయనకు స్వాగతం పలికాయి. పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి, డీఐజీ, ఎస్పీతో కలిసి ఆయన మహా సమాధిని దర్శించుకున్నారు.

ఆర్టీసీ ఆదాయం పెంచాలి

ఉద్యోగులకు ఎండీ ద్వారకా తిరుమలరావు పిలుపు

పుట్టపర్తిటౌన్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ప్రతి ఆర్టీసీ ఉద్యోగి అంకిత భావంతో పనిచేసి సంస్థ ఆదాయం పెంచాలని ఎండీ, డీజీపీ ద్వారకా తిరుమలరావు పిలుపునిచ్చారు. సత్యసాయి జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం పుట్టపర్తికి ఆయన విచ్చేశారు. ఆయన ఆర్టీసీ డిపోను సందర్శించి ఉద్యోగులు, కార్మికులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సంస్థ పురోభివృద్ధి కోసం ఉద్యోగులు, కార్మికులు ప్రైవేటు బస్సుల సేవలకు దీటుగా ప్రయాణికులకు సేవలందించి సంస్థ ఆదాయం పెంచానికి కృషిచేయాలన్నారు. ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలను ఈనెలాఖరులోపు చెల్లిస్తామన్నారు. సంక్రాంతి పండుగ రద్దీని పురస్కరించుకుని ఆర్టీసీ చరిత్రలోనే ఈనెల 20వతేదీన రూ.23కోట్ల 71వేలు ఆదాయం ఆర్జించిందన్నారు. అనంతరం ఉద్యోగులతో కలిసి డిపో ఆవరణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీఐజీ షిముషి, ఎస్పీ రత్న, ఆర్ఎం మధుసూధన్, డీఎం ఇనయతుల్లా పాల్గొన్నారు.

ఇష్టం లేకుంటే సెలవులో వెళ్లండి

సచివాలయ ఉద్యోగులపై మంత్రి సవిత ఆగ్రహం



సమస్యలను ఆలకిస్తున్న మంత్రి సవిత

గోరంట్ల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): 'పనిచేయడం ఇష్టం లేకపోతే సెలవులో వెళ్లండి.. సచివాలయ ఉద్యోగులు ఏ మండలంలోనూ లేని విధంగా ఇక్కడ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు..' అంటూ బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి సవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం గోరంట్లలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. పార్టీ నాయకులు, ప్రజల పట్ల బాధ్యతారాహిత్యంగా సచివాలయ సిబ్బంది వ్యవహరిస్తున్నట్లు మంత్రి మండిపడ్డారు. పనిచేయడం ఇష్టంలేకపోతేసెలవు పెట్టి వెళ్లిపోవాలన్నారు. ఎక్కడ చూసినా పారిశుధ్య పనులు అలాగే ఉన్నాయన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపట్ల అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులకులేదా అని ప్రశ్నించారు. మీరు చేస్తున్న తప్పులు సమావేశంలో చెప్పడం సరికాదు, విడిగా తెలియచేస్తానన్నారు. నెలరోజుల తరువాత మళ్లీ సమీక్షా సమావేశం ఏర్పాటు చేస్తామని, అప్పటికి అధికారుల పనితీరులో మార్పు రాకపోతే పంచాయతీల వారీగా సమీక్షిస్తామని, అప్పుడు బాధపడాల్సి ఉంటుందని మంత్రి హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మారుతి, ఎంపీడీఓ నరేంద్రకుమార్, అగ్రికల్చర్ ఏడీ అల్తాఫ్‌అలీఖాన్, ఏఓ మునిక్రిష్ణ, సీఐ శేఖర్, ఏఈలు గణేష్, మోహన్, వరప్రసాద్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

అశ్రునయనాల మధ్య బేడీకి అంతిమ వీడ్కోలు



నరేంద్రసింగ్‌బేడీ మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న మంత్రి సవిత

పెనుకొండ, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ప్రజా ఉద్యమకారుడు, యంగ్ ఇండియా ప్రాజెక్ట్ వ్యవస్థాపకుడు నరేంద్రసింగ్ బేడీకి మంగళవారం అశ్రునయనాలతో అంతిమ వీడ్కోలు పలికారు. గుట్టూరు సమీపంలోని ఆయన ఫామ్‌హౌస్‌లో వయోభారంతో సోమవారం మృతి చెందారు. మంగళవారం ఆయన పార్థివదేహానికి రాజకీయ ప్రముఖులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, వేలాది మంది ప్రజలు హాజరై అంతిమ వీడ్కోలు పలికారు. ఆయన అంతిమ యాత్రలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, మడకశిర మాజీ ఎమ్మెల్యే సుధాకర్, ఆర్డీటీ ప్రతినిధి అన్నా ఫెర్రర్, ఎస్ఎస్‌టీ ప్రతినిధి కంజిలాల్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు బబ్లూ గంగూలీ, డీపీ బలరాం, కిష్టప్ప, మేరీ, రాణి, వాసు, ఉత్తప్ప, రామాంజనేయులు, రాయలసీమ జిల్లాల్లోని స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, కొల్‌కతా నుంచి వేలాది మంది ప్రముఖులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. క్రిస్టియన్ సంప్రదాయ పద్ధతిలోనే ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు.

అణగారిన వర్గాల కోసం బేడీ కృషి : మంత్రి సవిత

పెనుకొండ రూరల్ : రాయలసీమలోని అణగారిన వర్గాల పేద ప్రజల కోసం నరేంద్రసింగ్ బేడీ నిరంతరం కృషిచేశారని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. బేడీ మృతిచెందిన విషయం తెలుసుకున్న మంత్రి మంగళవారం గుట్టూరు సమీపంలోని యంగ్‌ఇండియా ప్రాజెక్ట్ కార్యాలయానికి చేరుకుని నరేంద్రసింగ్ బేడీ మృతదేహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఎన్నో పోరాటాలు చేసి ప్రజల హక్కులు కాపాడి, సమసమాజ స్థాపన కోసం జీవితాన్ని, ఆస్తిని ధారపోసి త్యాగం చేసిన వ్యక్తి నరేంద్రసింగ్‌బేడీ కొనియాడారు. ఆమె వెంట టీడీపీ నాయకులు సూర్యనారాయణ, నాగరాజు ఉన్నారు.

24న జాబ్ మేళా

కదిరిఅర్బన్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 24న ఎస్‌టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిరుద్యోగులకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ స్మిత మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈమేళాలో మూడు కంపెనీల ప్రతినిధులు హాజరువుతారన్నారు. పది, ఇంటర్, డిగ్రీ చేసిన 18 నుంచి 35 సంవత్సరాల లోపు వారు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన వారికి రూ.12వేల నుంచి రూ.20వేల వరకు వేతనాలు ఉంటాయన్నారు. ఎంపికైనవారు అనంతపురం, కదిరి, బెంగళూరు, పెనుకొండలో ఉద్యోగం చేయాల్సి ఉంటుందన్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యేవారు బయోడేటాతోపాటు, ఆధార్, విద్యార్హతల పత్రాలు తీసుకుని ఉదయం 9 గంటలకు కళాశాల వద్దకు రావాలన్నారు. 9390176421కు ఫోన్‌చేసి, పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు.

బెల్ కంపెనీ అధికారితో ఎంపీ భేటీ



బెల్ కంపెనీ అధికారితో చర్చిస్తున్న ఎంపీ బీకే పార్థసారథి

గోరంట్ల, జనవరి 21(ఆంధ్రజ్యోతి): బెంగుళూరులోని బెల్ కంపెనీ ప్రధాన కార్యాలయంలో హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి కంపెనీ ఛైర్మన్, హెచ్‌ఆర్ డైరెక్టర్ విక్రమన్‌తో మంగళవారం భేటీ అయినట్లు ఓ ప్రకటనలో తెలిపారు. 2014లో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, కేంద్ర రక్షణ మంత్రి మనోహర్‌పారేకర్ గోరంట్ల మండలంలోని పాలసముద్రం వద్ద బెల్ కంపెనీ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. పార్లమెంటు పరిధిలో సీఎస్ఆర్ నిధులతో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. కంపెనీ అధికారి సానుకూలంగా స్పందిస్తూ, అభివృద్ధి పనుల గురించి వివరించారన్నారు.

విద్యార్థిని ఆత్మహత్య



మృతిచెందిన రోషిణి

గుంతకల్లుటౌన్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మిల్లు కాలనీలో నివాసముంటున్న విద్యార్థిని రోషిణి(19) కడుపునొప్పి తాళలేక మంగళవారం ఆత్మహత్య చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన మేరకు షేక్షావలి, నూర్జాహాన్ దంపతుల కుమార్తె రోషిణి పట్టణంలోని ఎస్కేపీ డిగ్రీ కళాశాలలో బీకాం కంప్యూటర్స్ మొదటి సంవత్సరం చదువుతుండేది. కొన్ని రోజులుగా కడుపునొప్పితో బాధపడుతుండేది. పలుచోట్ల వైద్యం చేయించినా నయం కాలేదు. ఈక్రమంలోనే మంగళవారం కడుపునొప్పి తీవ్రం కావడంతో తాళలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుంది. బ్యాంకు పనిమీద బయటికి వెళ్లి వచ్చిన తల్లిదండ్రులు ఇంట్లోకి వెళ్లగా ఉరికి వేళాడుతూ రోషిణి కనిపించింది. దీంతో వారు ఆమెను కిందకు దింపి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దొంగకు దేహశుద్ధి... పోలీసులకు అప్పగింత



పట్టుబడిన దొంగ

ఓబుళదేవరచెరువు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఓ దొంగకు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఈనెల 18న మధ్యాహ్నం కదిరి, హిందూపురం ప్రధాన రహదారి ఓడీసీ బాబా ఆలయం వెనుకవైపు ఉన్న ఆర్‌ఆర్ ఫ్యాన్సీలో గుర్తు తెలియని దుండగుడు షాపులలోని క్యాష్ డ్రా బీమ్‌ను తొలగించి అందులో ఉన్న రూ.24వేలు నగదును తీసుకుని ఉడాయించాడు. దీనిని షాపు నిర్వాహకుడు హుస్సేన్‌బాషా సీసీ కేమెరాలో గుర్తించారు. చోరీకి పాల్పడిన దొంగ మంగళవారం మండల కేంద్రంలో సంచరిస్తుండగా గుర్తించిన షాపు నిర్వాహకులు, గ్రామస్థులు పట్టుకుని, దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఆ దొంగ తన పేరు శ్రీరామప్ప అని, తమది హిందూపురం వద్ద ఉన్న శిరిపురమని చెబుతున్నట్లు పోలీసులు తెలిపారు. షాపు నిర్వాహకుడు హుస్సేన్‌బాషా ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పరిటాల రవీంద్ర వర్ధంతికి ఏర్పాట్లు

దగ్గరుండి పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్

రామగిరి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి పరిటాల రవీంద్ర 20వ వర్ధంతికి మండలంలోని వెంకటాపురంలో ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయి. ఎమ్మెల్యే పరిటాల సునీత, ఆమె తనయుడు పరిటాల శ్రీరామ్ మంగళవారం దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షించారు. పరిటాల రవీంద్ర మరణించి 20 ఏళ్లు గడిచిన క్రమంలో ఈ సారి వర్ధంతి కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహించేందుకు, నాలుగు రోజుల నుంచి ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాతో పాటు రాష్ట్రం నలుమూలల నుంచి పరిటాల రవీంద్ర అభిమానులు వేలాదిగా తరలివచ్చేందుకు సిద్ధమవు తుండటంతో, అందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేపట్టారు. మరో వైపు పరిటాల రవీంద్ర ఘాట్ వద్ద కూడా అలంకరణలు చేస్తున్నారు. ముఖ్యంగా అన్నదాన కార్యక్రమానికి సంబంధించి ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూస్తున్నారు.

రైల్వే సమస్యలు పరిష్కరించండి

సౌత్ వెస్ట్రన్ రైల్వే జనరల్ మేనేజర్‌కు ఎంపీ అంబికా వినతి



వినతి పత్రం అందజేస్తున్న ఎంపీ అంబికా

అనంతపురం అర్బన్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): పలు రకాల రైల్వే సమస్యలను పరిష్కరించాలని సౌత్ వెస్ట్రన్ రైల్వే జనరల్ మేనేజర్ అరవింద శ్రీవాత్సవను ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కోరారు. ఈ మేరకు మంగళవారం బెంగళూరులోని సౌత్ వెస్ట్రన్ రైల్వే కార్యాలయంలో ఆయన్ను కలిసి వినతి పత్రం అందజేశారు. టాటా నగర్ - యశ్వంతపూర్ ఎక్స్‌ప్రెస్, మైసూర్- వారణాసి ఎక్స్‌ప్రెస్, యశ్వంతపూర్ - జైపూర్, తిరుపతి - దొడ్డనహళ్లి రైళ్లను రాయదుర్గంలో నిలపాలని కోరారు. ధర్మవరం- మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్‌ను రాయలచెరువులో నిలపాలన్నారు. వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను హిందూపురంలో నిలపాలన్నారు. రాజధాని ఎక్స్‌ప్రెస్‌ను హిందూపురం, అనంతపురం, పెనుకొండ ప్రాంతాల్లో నిలపాలని కోరారు. ధర్మవరం-మచిలీ పట్నం ఎక్స్‌ప్రెస్‌ను హిందూపురం వరకు కొనసాగించాలన్నారు. అనంతపురం, హిందూపురం రైల్వే స్టేషన్లల్లో హైడ్రాంట్ వాటర్ కోచ్‌ను ఏర్పాటు చేయడం ద్వారా రైల్వేకి, ప్రయాణికులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రయాణిలకు ఫస్ట్ ఎయిడ్‌ను అందుబాటులో ఉంచాలని కోరారు.

న్యూస్ బాక్స్

మామిడి రైతులకు అవగాహన సదస్సు



అవగాహన కల్పిస్తున్న జిల్లా ఉద్యాన శాఖాధికారి చంద్రశేఖర్

బుక్కపట్నం, జనవరి 21(ఆంధ్రజ్యోతి) : మామిడి పంటపై తీసుకోవాల్సిన యజమాన్య పద్ధతులపై జిల్లా ఉద్యానవన శాఖాధికారి చంద్రశేఖర్ మండలంలోని సిద్దరాంపురం గ్రామంలో మంగళవారం రైతులకు అవగాహన కల్పించారు. ఇందులో సిద్దరాంపురం, కొత్తకోట, గూనిపల్లి గ్రామాలకు చెందిన మామిడి రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రస్తుతం జిల్లాలో నెలకున్న అనుకూల పరిస్థితుల కారణంగా మామిడి తోటల్లో 50 నుంచి 60 శాతం వరకు పూత వచ్చిందన్నారు. పూతరాని తొటలో 30.0.45 అనే ఎరువును 10గ్రా. సూక్ష్మదాత మిశ్రమం, ఒక లీటర్ నీటితో కలిపి పిచికారి చేస్తే త్వరగా పూత వచ్చే అవకాశముంటుందన్నారు. పూత త్వరగా వచ్చి, మంచు నుంచి రక్షణంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ సతీష్‌బాబు, టీడీపీ కన్వీనర్ చింతా మల్లిరెడ్డి, ఉద్యానశాఖాధికారులు అభినయ్, ఆశజ్యోతి, అన్నపూర్ణ, సుధాకర్, లక్ష్మీ, మామిడి రైతులు పాల్గొన్నారు.

లద్దెపురుగును నివారించండి



రైతులకు సూచనలిస్తున్న ఏడీ క్రిష్ణయ్య

తాడిమర్రి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వేరుశెనగ పంటకు లద్దెపురుగు వ్యాపిస్తోందని, దాని నివారణకు రైతులు తగు చర్యలు తీసుకోవాలని ఏడీఏ క్రిష్ణయ్య, ఏరువాక కేంద్రంశాస్త్రవేత్త రామసుబ్బయ్య సూచించారు. మండలంలోని పిన్నదరి, మరువపల్లి గ్రామాల్లో వేరుశెనగ పొలాలను పరిశీలించిన వారు రైతులతో మాట్లాడారు. వేరుశెనగలో లద్దెపురుగు నివారణకు ఉధృతిని బట్టి ఎమోమెక్టిన్ బెంజోయోట్, నోవాల్యూరాన్ 1.5 ఎంఎల్ లీటరు నీటితో కలిపి పిచికారి చేయాలన్నారు. మొదలు కుళ్లు తెగులు నివారణకు హెక్సాకొనజోల్ 2 మిల్లీలీటర్‌ను లీటరు నీటితో కలిపి మొక్క మొదలు బాగా తడిచేలా పిచికారి చేసుకోవాలన్నారు. పూత దశలో ఉన్న వేరుశెనగలో ఎకరాకు జిప్పం 200 కిలోల, 10 కిలోల యూరియా వేయడం వల్ల అధికదిగుబడి పొందే అవకాశం ఉందన్నారు. మొక్కజొన్న పంట సాగు చేసే రైతులు కూడా కత్తెర పురుగు నివారణకు ఎమోమెక్టిన్ బెంజోయోట్ 0.4 గ్రాము లీటరు నీటితో కలిపి పిచికారి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ రమాదేవి, రైతుసేవా కేంద్రం సిబ్బంది నాగేంద్ర, నిజాముద్దీన్, పిన్నదరి, మరువపల్లి రైతులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి సన్మానం

ధర్మవరం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ సత్యసాయి జిల్లా అధ్యక్షుడిగా జీఎం శేఖర్ రెండో సారి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. దీంతో మంగళవారం ధర్మవరం బీజేపీ జాతీయ నాయకులు అంబటి సతీశ్, పట్టణ అధ్యక్షుడు జింకా చంద్రశేఖర్, జిల్లా ఉపాధ్యక్షుడు సాకే ఓబుళేశు, నాయకులు గుండాపుల్లయ్య, చంద్రహేశ్ పుట్టపర్తిలో జీఎం శేఖర్‌ను కలిసి సన్మానించారు.

● ముదిగుబ్బ : జీఎం శేఖర్‌కు ముదిగుబ్బకు చెందిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సోమల ప్రకాశ్, మండల కన్వీనర్ అంజన్‌రెడ్డి, నాయకులు గంగాధర్‌రెడ్డి పుట్టపర్తిలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఇంటింటి సర్వే తనిఖీ



మచ్చలను పరిశీలిస్తున్న జిల్లా కుష్ఠు నియంత్రణ అధికారి తిప్పయ్య

పుట్టపర్తి రూరల్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్యకేంద్ర పరిధిలోని పెదపల్లి సుబ్బరాయినిపల్లిలో కుష్ఠు, క్షయ, హెచ్‌ఎంపీవీ వ్యాధులపై అవగాహన, ఇంటింటి సర్వేను జిల్లా కుష్ఠు నియంత్రణ అధికారి తిప్పయ్య మంగళవారం తనిఖీ చేశారు. ఆయన సిబ్బందితో మాట్లాడుతూ కుష్ఠు వ్యాధిపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించి వారికి సరైన అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధి కారి నగేష్, సూపర్ వైజర్ చంద్రకళ, టీబీ సూపర్ వైజర్ అబిద్ బాషా, ఎంఎల్‌హెచ్‌పీ సత్యమ్మ అంగన్వాడీలు పాల్గొన్నారు.

2న కంటి వైద్యశిబిరం

ధర్మవరం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో వచ్చే నెల రెండో తేదీన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు శీలానాగేంద్ర, కార్యదర్శి జయరాం పేర్కొన్నారు. మంగళవారం స్థానిక స్వాతి క్లినిక్‌లో అందుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించిన వారు మాట్లాడారు. ఈ వైద్యశిబిరాన్ని ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైద్య శిబిరానికి భారీ స్పందన

ధర్మవరం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): స్థానిక 22వ వార్డు నాయకుడు ప్రకాశ్‌గౌడ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయ ఆవరణంలో మంగళవారం కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కర్నూల్‌కు చెందిన శాంతిరాం ఐ ఆస్పత్రి సహకారంతో నిర్వహించిన ఈ శిబిరాన్ని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు ప్రారంభించారు.

నేడు ఎమ్మెల్యే రాక

నల్లమాడ, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి బుధవారం వస్తున్నట్లు మండల కన్వీనర్ మైలే శివశంకర్ తెలిపారు. వ్యవసాయ, వెలుగు ఎఫ్‌పీఓ వారు సంయుక్తంగా నిర్వహిచే సమావేశానికి ఎమ్మెల్యే హజరవుతారన్నారు.

నేడు డాకు మహారాజ్ విజయోత్సవ సభ

అనంతపురం అర్బన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ కథానాయకుడు నందమూరి బాలకృష్ణ నటించిన డాకు మహారాజ్ సినిమా విజయోత్సవ సభ బుధవారం నిర్వహించనున్నారు. అనంతపురం నగరం శ్రీనగర్ కాలనీ అయ్యప్పస్వామి ఆలయం సమీపంలో సాయంత్రం 6.30 గంటలకు ఈవెంట్ ప్రారం భంకానుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హిందూ పురం ఎమ్మెల్యే, సినీహీరో నందమూరి బాలకృష్ణతోపాటు చిత్ర యూనిట్ సభ్యులు హాజరుకానున్నారు. ఇందుకు సంబధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. గతంలోనే సినిమా ప్రీ రిలీజ్ ఈ వెంట్ జిల్లా కేంద్రంలో నిర్వహించాలని భావించి, అన్ని ఏర్పాట్లు చేశారు. అయితే తిరుమలలో జరిగిన ప్రమాద ఘటన నేపథ్యంలో ఈవెంట్‌ను రద్దు చేసిన విషయం తెలిసిందే.

పాడి పరిశ్రమకు చేయూత



సంజీవపురం పశు వైద్యశిబిరంలో మందులను పంపిణీ చేస్తున్న సిబ్బంది (ఫైల్)

- గ్రాసం పెంచేలా చర్యలు
- మినీ గోకులాలకు శ్రీకారం
- గ్రామాల్లో పశువైద్య శిబిరాలు
- అందుబాటులో మందులు, టీకాలు

బత్తలపల్లి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): పాడి రైతులను ఆదుకునేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పాడి పరిశ్రమ అభివృద్ధికి అనేక పథకాలను ప్రారంభించింది. ఉచితంగా గ్రాసం పెంపకానికి రైతులకు ఉపాధి నిధులు సమకూర్చుతోంది. పశువులు, గొర్రెలు, మేకలు తదితర జీవాల పెంపకదారులకు 90 శాతం రాయితీతో మినీ గోకులాలను నిర్మించే పథకాన్ని ప్రారంభించింది. తాజాగా గ్రామాల్లో పశువైద్య శిబిరాలను నిర్వహిస్తూ పశువులకు వైద్య సేవలు అందించడంతో పాటు టీకాలను వేయించేలా చర్యలు తీసుకుంది. ఈ నెల ఆఖరి వరకు గ్రామీణ పశు వైద్య కేంద్రాలు, రైతు సేవా కేంద్రాల వద్ద పశు వైద్య శిబిరాలను నిర్వహిస్తూ.. పాడి రైతులను ఆదుకునేలా చర్యలు చేపట్టింది. వీటి నిర్వహణ కోసం కూటమి ప్రభుత్వం జిల్లాకు రూ. 86 లక్షలు విడుదల చేసింది. దీంతో పాడి రైతులు హర్ష వ్యక్తం చేస్తున్నారు.

● కష్టాలకు చెక్

సత్యసాయి జిల్లాలో ఆవులు, గేదలు సుమారు 2,35,000, గొర్రెలు, మేకలు 28,00,000 ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో పశువైద్యశాలల్లో సరైన మందులు లేక పాడి రైతులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. పశువులకు ఏదైనా వ్యాధులు సోకితే.. మార్కెట్లో అధిక రేట్లకు రైతులు కొనుగోలు చేసేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పాడి రైతులను ఆదుకునేలా చర్యలు తీసుకుంది. గ్రామాల్లోనే పశువైద్య శిబిరాలను నిర్వహించేలా చర్యలు తీసుకుంది. ప్రతి రోజు రెండు గ్రామాల్లో ఈ నెల ఆఖరి వరకు ఈ శిబిరాలను నిర్వహిస్తోంది. ఈ శిబిరాలలో ఒక పశువైద్య అధికారి, ఇద్దరు సహాయకులు, ఒక అటెండరు ఉంటూ పశువులకు వైద్య సేవలు అందిస్తున్నారు. జిల్లాలో 78 పశువైద్య కేంద్రాలు, 286 రైతు సేవా కేంద్రాలు ఉన్నాయి. వీటి ద్వారా పశువులకు వైద్య సేవలు అందిస్తున్నారు. మూగ జీవాలకు వైద్య పరీక్షలతో పాటు శాస్త్ర చికిత్సలు, అవసరమైన మందులు ఉచితంగా ఇస్తున్నారు. గర్భకోశవ్యాధులకు పరీక్షలు నిర్వహించి తగు వైద్యం అందిస్తున్నారు. చిన్నదూడలకు, గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందు ఉచితంగా పంపిణీచేస్తున్నారు. పశు ఆరోగ్య సంరక్షణలో భాగంగా అన్ని గ్రామాల్లో పశువులకు టీకాలు వేస్తున్నారు. పశువుల్లో ఏలికపాము నివారణకూ మందులను అందుబాటులో ఉంచారు. పాల ఉత్పత్తి పెంచడంతో పాటు గొర్రెలు, మేకలు, కోళ్ళు తదితర వాటికి మాసూచి నివారణ మందులు కూడా పంపిణీ చేస్తున్నారు.

సద్వినియోగం చేసుకోండి

పాడిపరిశ్రమను అభివృద్ధి చేసేందుకు.. ఆదుకునేందుకు ప్రభుత్వం 11 రోజుల పాటు పశు వైద్య శిబిరాలను నిర్వహిస్తోంది. పశువులు ఆరోగ్యంగా ఉండడం కోసం ఏలిక పాములు నివారణకు మందుల కూడా పంపిణీ చేస్తున్నాం. పాడి రైతులు అందరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

- సుబ్బదాస్, జేడీ

కష్టాలు తీరాయి



గతంలో పశువులకు ఏదైన జబ్బుచేస్తే మందులు బయట కొనేవాళ్లం. పశువైద్యశాలలో మందులు ఉండేవి కావు. వేలాది రూపాయలు ఖర్చు అయ్యేవి. ఇప్పుడు ఆ కష్టాలు తీరాయి. పశువైద్య శిబిరాల ద్వారా గ్రామాల్లోనే పశువులకు వైద్య సేవలు అందుతున్నాయి. ఇలా ప్రతి నెలా వైద్య శిబిరాలు నిర్వహిస్తే చాలా బాగా ఉంటుంది.

- గడుపుటి రమేష్ బాబు, పాడిరైతు, బత్తలపల్లి

ఆర్థిక భారం తగ్గింది



గ్రామాల్లో పశువులకు ఏదైన జబ్బు చేస్తే.. వాటిని వాహనాల్లో పశువైద్యశాలకు తీసుకెళ్లి చూపిం చడానికి చాలా ఖర్చు అయ్యేది. ఇప్పుడు గ్రామా ల్లోనే పశువులకు వైద్య శిబిరాలు నిర్వహిస్తుండటంతో పాడి రైతులకు ఆ ఖర్చు తగ్గినట్లైంది. మందులను కూడా అందుబాటులో ఉన్నాయి. పశువైద్యం శిబిరాలకు ప్రభుత్వం మరిన్ని నిధులు కేటాయించాలి.

- సుదర్శన్, పాడిరైతు, బత్తలపల్లి

అందుబాటులో మందులు



గతంలో పశువులకు సంబంధించిన మందులు పశు వైద్యశాలలో అందుబాటులో ఉండేవి కావు. మందుల కోసం పట్టణాలను వెళ్లేవాళ్లం. ఇప్పుడు పశువైద్యశాలలో అన్ని మందులు అందుబాటులో ఉంటున్నాయి. అంతే కాకుండా గ్రామాల్లోనే పశువైద్య శిబిరాలను నిర్వహిస్తూ పాడి రైతులను ఆదుకునేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం హర్షణీయం.

- శివయ్య, గొర్రెల కాపరి, గంటాపురం

జొన్నలకొత్తపల్లి తండాకు రహదారి సమస్య తీరుస్తాం

జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్





జొన్నలకొత్తపల్లి తండా సమావేశంలో మాట్లాడుతున్నహుస్సేన్‌నాయక్, నార్సింపల్లి తండాలో గ్రంథాలయ ప్రారంభోత్సవంలో..

ముదిగుబ్బ, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నలకొత్తపల్లి తండాకు రహదారి సమస్య తీరుస్తామని జాతీయ ఎస్టీ కమిషన్ మెంబరు జాటోత్ హుస్సేన్‌నాయక్ భరోసా ఇచ్చారు. జిల్లా పర్యటనలో భాగంగా జొన్నలకొత్తపల్లి తండాను ఆయన సందర్శించారు. వీధుల్లో తిరుగుతూ మౌలిక సదుపాయాలు, సమస్యలను అడిగితెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మూడు నెలల్లో రోడ్లను నిర్మించే విధంగా కృషిచేస్తామని తండావాసులుకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం ఆర్డీఓ మహేశ్, తహసీల్దార్ నారాయణస్వామి, గిరిజన సంఘాల నాయకులు సేవేనాయక్, తిరుపాల్ నాయక్, టీడీపీ నాయకులు నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● శ్రీవారి సేవలో...

కదిరి : సానిక ఖాద్రీలక్ష్మీనరసింహస్వామిని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌నాయక్ మంగళవారం దర్శించుకున్నారు. ఆయనకు కదిరి ఆర్డీఓ వీవీఎస్ శర్మ, డీఎస్పీ శివనారాయణస్వామి, ఆలయఅధికారులు, అర్చకులు, ఎస్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామి, అమ్మవారికి విశేషపూజలు చేశారు. ఆలయ అధికారులు ఆయన్ను సత్కరించారు. ఆయన వెంట తహసీల్దార్ మురళీకృష్ణ, ఎంపీడీఓ పొలప్ప, గిరిజన సంఘం నాయకులు ఉన్నారు.

● గ్రంథాలయం ప్రారంభం

బుక్కపట్నం : మండలంలోని నార్సింపల్లి తండాలో గిరిజన కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్, ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి నూతన బోరును, గ్రంథాలయాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నార్సింపల్లి చార్టిబుల్ సభ్యుడు ఆంజనేయప్రసాద్, బాలాజీనాయక్, మోహన్‌నాయక్, సర్పంచ్ క్రిష్ణబాయి, ఎంఈఓలు గోపాల్‌నాయక్, సుధాకర్‌నాయక్, ఏఈ జమునాయి పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక



పరిటాల శ్రీరామ్ సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

ధర్మవరం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): స్థానిక లోనికోట ప్రాంతానికి చెందిన వైసీపీ నాయకుడు అమర్‌తోపాటు 50 కుటుంబాల సభ్యులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. మంగళవారంలోని కోట ప్రాంతంలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ వీరికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం పరిటాల శ్రీరామ్ మాట్లాడు తూ... పార్టీలోకి వచ్చినప్రతి ఒక్కరికి సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీ సీడ్స్ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ కమతం కాటమయ్య, టీడీపీ నాయ కులు చింతలపల్లి మహేశ్‌చౌదరి, సంధా రాఘవ, పణికుమార్, చింతపులుసు పెద్దన్న, భీమనేని ప్రసాద్ నాయుడు, మాధవరెడ్డి, అంబటిసనత్, నాగూర్ హుస్సేన్, రాళ్లపల్లి షరీఫ్, గవ్వల నారాయణస్వామి, గోసల శ్రీరాములు, తలారి చంద్ర మోహన్, అడ్రమహేశ్ పాల్గొన్నారు.

● 24న నాటక ప్రదర్శన

ముదిగుబ్బ: మాజీ మంత్రి, స్వర్గీయ పరిటాల రవీంద్ర 20వ వర్ధంతి సందర్భంగా ముదిగుబ్బలో పాతవూరు సూర్య చంద్ర అభయ ఆంజనేయస్వామి దేవస్థాన ఆవరణంలో శుక్రవారం సప్తమాంకాలు అనే ఉచిత నాటిక ప్రదర్శన ఉంటుందని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను పరిటాల శ్రీరామ్ చేతుల మీదుగా ధర్మవరంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముదిగుబ్బ క్లస్టర్ ఇన్‌చార్జ్ తుమ్మల మనోహర్, ఉత్తమ్‌నాయుడు, డ్రామా కళాకారులు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై అవగాహన

ధర్మవరం రూరల్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్లూరు గ్రామంలో రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా రహదారి భద్రతపై మంగళవారం అవగాహన కల్పించారు. విద్యార్థులతో కలిసి గ్రామంలో ర్యాలీ చేపట్టారు. రహదారి భద్రత మనందరి బాధ్యతగా వ్యవహరించాలని, ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్, సీటుబెల్టు ధరించాలని సూచించారు. మైనర్లు వాహనాలు నడిపితే వాహనాలు ఇచ్చిన తల్లిదండ్రులకు జరిమానాలతో పాటు కేసులు కూడా నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ పోలీస్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

● బత్తలపల్లి : రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో సీఐ ప్రభాకర్ ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు.



ధర్మవరం: అవగాహన కల్పిస్తున్న సీఐ, ఎస్ఐ

ఆర్టీసీ సమస్యలు పరిష్కరించండి

కదిరిఅర్బన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కదిరి ఆర్టీసీ డిపోలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని డీజీపీ, మేనేజింగ్ డైరెక్టర్ ద్వారాతిరుమలరావును డిపో మజ్దూర్ నాయకులు కోరారు. మంగళావారం పుట్టపర్తిలో కలిసి వినతిపత్రం అందజేశారు. కదిరి డిపోకు సూపర్‌లెగ్జరీ, అల్ట్రా డీలక్స్ పల్లెవెలుగు బస్సులు మంజూరు చేయాలని కోరారు. అలాగే డిపో నుంచి సికింద్రాబాద్, బ్రహ్మంగారిమఠం, శ్రీకాళహస్తికి బస్సులు నడపాలని కోరారు. ఈ కార్యక్రమంలో మజ్దూర్ నాయకులు ఎన్‌వీ రమణ, డీ. లక్ష్మీనారాయణ, షబ్బీర్, శ్రీరామనాయక్ పాల్గొన్నారు.

క్రైం న్యూస్ ..

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

కదిరి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): స్థానిక మూర్తిపల్లి రోడ్డు సమీపంలో వ్యభిచారం నిర్వహిస్తున్న ఓ గృహంపై మంగళవారం దాడులు నిర్వహించినట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు. ఆ వ్యభిచార గృహంలోని ముగ్గురు ఆడవారు, ఇద్దరు మగవారి అరెస్టు చేసి కేసునమోదు చేశామన్నారు. వ్యభిచార గృహం నిర్వాహకురాలు పరారీలో ఉన్నట్లు తెలిపారు.

విద్యార్థి అదృశ్యం



హేమంత్

ఓబుళదేవరచెరువు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీ డీఓ కార్యాలయం వెనుకవైపు నివాస ముంటున్న రామక్రిష్ణ కుమారుడు హేమంత్ కనిపించడంలేదు. అమడ గూరు మండలంతోని కంచెనగారిపల్లి చెందిన రామక్రిష్ణ కుమారుడు హే మంత్ తమ నాన్నమ్మతో కలిసి ఓబుళదేవర చెరువులో ఉంటున్నాడు. ఓడీసీలో ప్రైవేటు పాఠ శాలలో 8వ తరగతి చదువుతున్నాడు. సోమవారం సాయంత్రం నుంచి హేమంత్ కనిపించలేదు. అతని తండ్రి బంధువులు ఇళ్లల్లో గాలించినా ఫలితం లేకపోయింది. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి మంగళవారం తెలిపారు.

కదిరి మండలంలో బాలిక ...

కదిరిఅర్బన్ : మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికల అదృశ్యమైంది. ఓ గ్రామానికి చెందిన బాలిక సోమవారం నుంచి కనిపించలేదని ఆ బాలిక తండ్రి మంగళవారం ఫిర్యాదు చేసినట్లు రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. బంధువులు, స్నేహితుల వద్ద ఆరా తీసినా.. ఆచూకీ లభించలేదన్నారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు చెప్పారు.

రీసర్వేతో భూ సమస్యలకు పరిష్కారం



మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ మహేష్

ధర్మవరంరూరల్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): రీసర్వేతో భూ సమస్యల పరిష్కారం అవుతాయని ఆర్డీఓ మహేష్ తెలిపారు. మండలంలోని సుబ్బరావుపేట గ్రామాన్ని పైలట్ రీసర్వే గ్రామంగా ఎంపిక చేశారు. మంగళవారం ఆ గ్రామంలో రీసర్వేను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆర్డీఓ మహేష్ గ్రామానికి సంబంధించి భూముల సర్వే మ్యాప్‌ను పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ రైతులంతా అందుబాటులో ఉండి రీసర్వేలో భూముల కొలతలను చూసుకోవాలన్నారు. ప్రజలు తమ భూమి సమస్యలను పరిష్కారించుకోవడానికి ఇదోక మంచి అవకాశమన్నారు. గ్రామంలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వి నియోగం చేసుకోవాలన్నారు. రీసర్వేలో ఎటువంటి పొర పాట్లుకు తావులేకుండా పకడ్బందీగా చేయాలని అధికా రులకు సూచించారు. ఆయన వెంట రీసర్వే డీటీ రమణ బాబు, మండలసర్వేయర్ మంజులదేవి, గ్రామ సర్వేయర్లు ఉన్నారు.

చౌడేశ్వరిని దర్శించుకున్న ఎమ్మెల్సీ

ఓబుళదేవరచెరువు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): అమడగూరులోని చౌడేశ్వరీ అమ్మవారిని ఎమ్మెల్సీ భూమిరెడ్డి కుటుంబ సభ్యులు మంగళవారం దర్శించుకున్నారు. అనంతరం ఆలయ విశిష్టిత, అభివృద్ధి గురించి అడిగి తెలుసుకున్నారు. ఆలయాభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామన్నారు. ఎమ్మెల్సీ వెంట టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యాక్షుడు రామాంజులనాయుడు, మాజీ జడ్పీటీసీ శ్రీనివాసరెడ్డి, మాజీ కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.



చౌడేశ్వరి ఆలయం వద్ద ఎమ్మెల్సీ దంపతులు

న్యూస్ బాక్స్

పూర్వ విద్యార్థి దాతృత్వం



పాఠశాలకు ఫర్నిచర్ అందజేస్తున్న జనార్దన్ రావు

మడకశిర టౌన్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోటబడి ప్రాథమిక పాఠశాలలో విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థి తన దాతృత్వాన్ని చాటుకొన్నారు. కెనరాబ్యాంకు ఏజీఎంగా ఢిల్లీలో విధులు నిర్వహిస్తున్న ఎం.జి.జనార్ధన్‌రావు కోటబడి ప్రాథమిక పాఠశాలలో ఐదవ తరగతి వరకు చదువుకున్నారు. ఆయన మంగళవారం పాఠశాలను సందర్శించి ఆర్ఓఫిల్టర్, ఫర్నిచర్, బీరువాలు, విద్యార్థులకు వాటర్ బాటిళ్లను ప్రధానోపాధ్యాయురాలు చంద్రకళావతి సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక స్థాయిలో ఇదే పాఠశాలలో తాను విద్యను అభ్యసించానని, అప్పటి గురువులు నేర్పిన విద్యవల్లే తాను ఈస్థాయికి ఎదిగానన్నారు. ఈ కార్యక్రమంలో మడకశిర కెనరాబ్యాంకు మేనేజర్ శ్రీకాంత్, గుడిబండ మేనేజర్ మల్లయ్యతోపాటు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంబిగర చౌడయ్య జయంతి

పావగడ, జనవరి 21(ఆంధ్రజ్యోతి): అంబిగర చౌడయ్య జయంతిని పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ వరదరాజులు సంఘం అధ్యక్షులు గోపాల్, సిబ్బంది చౌడయ్య చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నిర్వహించారు. 12వ శతాబ్దంలో అంటరానితనం, మూఢనమ్మకాలపై విప్లవ పోరాటం చేసి కాయకమే కైవశమని సిద్ధాంతంతో సమాజాన్ని శాంతిబాటలో నడిపించిన ఘనుడు అంబిగర చౌడయ్య, బసవన్న అని తహసీల్దార్ తెలిపారు. ఆ మహనీయుల అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు.

రైతు సమస్యలను పరిష్కరించండి

చిలమత్తూరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): సాగుచేసిన పంటలు పూర్తిగా దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారని, వారిని ఆదుకునే విధంగా నివేదికలు ప్రభుత్వానికి అందజేయాలని ఏఓ వంశీకృష్ణకి రైతు సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. మంగళవారం వారు స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయానికి వెళ్లి పలు విషయాలను ఆయనకు తెలియజేశారు. గత ఏడాది ఖరీఫ్‌లో వాతావరణ మార్పులతో కంది, వేరుశనగ, మొక్కజొన్న, టమోట, మిరప వంటి పంటలను పూర్తిగా నష్టపోయారన్నారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన ఇన్‌పుట్‌సబ్సిడీ, పంట బీమా వంటి సదుపాయాలు కల్పించే విధంగా ప్రభుత్వానికి నివేదిక అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు మహదేవ్, కాటమయ్య, గోవిందరెడ్డి, చలపతి, రంగప్ప, పాల్గొన్నారు.

సస్యరక్షణ పద్ధతులు పాటించాలి

పెనుకొండ రూరల్, జనవరి 21(ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్, రబీ సీజన్‌లో సాగుచేసిన పంటలపై రైతులు సస్యరక్షణ చర్యలు తీసుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏడీ స్వయంప్రభ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం రొద్దం మండలంలో వ్యవసాయాధికారులు పొలంబడి నిర్వహించారు. ప్రస్తుత పంటలైన మొక్కజొన్న, పప్పుశనగ పంటల్లో పాటించాల్సిన ఎరువుల యాజమాన్యం, తెగుళ్ళ యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి నివేదిత, విస్తరణాధికారి హంసవేణి పాల్గొన్నారు.

కొండంపల్లిలో పశువైద్య శిబిరం



గొర్రెలకు టీకా వేస్తున్న వైద్యులు

పెనుకొండరూరల్, జనవరి 21(ఆంధ్రజ్యోతి) :మండలంలోని కొండంపల్లిలో పశువైద్యశిబిరం నిర్వహించి నట్లు జిల్లా వైద్యాధికారి శుభదాస్ పేర్కొన్నారు. టీడీపీ నాయకులు వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో గ్రామంలోని పాడి పశువులకు నట్టల నివారణపై అవగాహన కల్పించి, పశువులకు టీకాలువేసి మందులు పంపిణీ చేశారు.

పొలం పిలుస్తోందిపై అవగాహన

అగళి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మధూడి, ఇనగలూరు రైతు సేవ కేంద్రాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమం వ్యవసాయశాఖ అధికారి శేఖర్‌నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఒకే రకమైన పంటలు కాకుండా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలన్నారు.

రికార్డ్స్ తప్పనిసరి

అగళి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ వాహనాలకు రికార్డ్స్‌తో పాటు డ్రైవింగ్ లైసెన్స్ ఇన్సూరెన్స్ తప్పనిసరిగా ఉండాలని అగళి ఎస్ఐ వీరేష్ పేర్కొన్నారు.

కలవరపెడుతున్న కత్తి కల్చర్

- పురంలో పెరుగుతున్న కత్తిపోటు సంఘటనలు
- అనుమానాస్పద ప్రాంతాలపై ఎస్పీ ప్రత్యేక ఫోకస్
- ప్రత్యేక బృందాలతో జల్లెడ



పోలీసు అధికారులతో చర్చిస్తున్న ఎస్పీ రత్న(ఫైల్)

హిందూపురం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి):హిందూపురంలో క్షీణిస్తున్న శాంతిభద్రతలు పోలీసులకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. వారానికోచోట కత్తులతో దాడిచేసుకోవడం, చిన్నచిన్న నేరాలు జరగడంతో వాటిని ఎస్పీ సీరియస్‌గా పరిగణిస్తున్నారు. హిందూపురంలో ఎలాగైనా అసాంఘిక కార్యక్రమాలకు చెక్‌పెట్టాలనే ఉద్దేశ్యంతో జిల్లా కేంద్రం నుంచి ప్రత్యేక బృందాలను అక్కడకు పంపారు. రెండు రోజులుగా ఇక్కడే మకాం వేసి అనుమానాస్పద వ్యక్తులను, ప్రాంతాలను జల్లెడ పడుతున్నారు. చిలమత్తూరు మండలంలో సామూహిక అత్యాచారం జరిగిన అనంతరం హిందూపురం పట్టణంలో ఒకదాని వెనుక ఒకటి అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుండటంతో అసలు వీటిని ఎందుకు అరికట్టలేకుండాపోతున్నామని స్థానిక పోలీసు అధికారులను ఎస్పీ ఘాటుగా ప్రశ్నించినట్టు సమాచారం. ఈ నేపథ్యంలోనే వారంపాటు ప్రత్యేక బృందాలు ఇక్కడే ఉండి నేరాల నియంత్రణపై ఫోకస్ పెట్టాయి.

కత్తి కల్చర్‌పై ఎస్పీ సీరియస్

ఇదిలా ఉండగా ఎన్నడూలేని విధంగా కొంతకాలంగా హిందూపురంలో కొంతమంది కత్తులు వెంటబెట్టుకుని తిరుగుతుండటం, కత్తులతో పొడుచుకోవడం లాంటి సంఘటనలు వెలుగు చూస్తుండటంతో వాటిని ఎస్పీ సీరియస్‌గా పరిగణించారు. నేరాలకు పాల్పడే వారు ఎంతటివారైనా వారి వెనుక ఎవరున్నా వదిలే ప్రసక్తేలేదని అలాంటి వారిపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరికలు జారీచేశారు. ముఖ్యంగా కత్తికల్చర్‌ను తుద ముట్టించాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానిక పోలీసు అధికారులను ఆదేశించారు. ఇదిలా ఉండగా ఈ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా నందమూరి బాలకృష్ణ ప్రాతినిథ్యం వహిస్తుండటంతో చిన్నపాటి ఘటన జరిగినా సోషల్ మీడియాలో ఇటీవల రచ్చచేస్తున్నారు. ఇతర ప్రాంతాల్లో పెద్దపెద్ద ఘటనలు జరిగినా అణగదొక్కుతున్నారు. కానీ పురంలో చిన్నపాటి ఘటనలను సైతం పెద్దగా చూపుతుండటంతో ఎస్పీ ప్రత్యేక నిఘా ఉంచారు. ఎలాగైనా చిన్నపాటి ఘటనలు కూడా జరగకుండా పోలీసులు తమవంతు పాత్ర పోషించాలని ఆదేశాలు ఇచ్చారు. ఇప్పటికే పట్టణంలో రాత్రి 10గంటలకు దుకాణాలు మూయిస్తున్నారు. దీనివల్ల కొంతవరకూ నేరాలు తగ్గవచ్చని పోలీసులు భావించారు. అయితే ఇటీవల కొన్ని ప్రాంతాల్లో రాత్రి 12వరకు షాపులు తెరుచుకుని ఉండటం, యువత రోడ్డుపై ఉండటంతో ఎస్పీ ఇటీవల ప్రత్యేక టీమ్‌ను పంపి డ్రోన్ ద్వారా వీధుల్లో నిఘా పెట్టినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే ఇకమీదట రాత్రిళ్లలో నేరుగా ఎస్పీనే హిందూపురానికి వచ్చి ఆకస్మికంగా తనిఖీలు చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిసింది.

ప్రత్యేక బృందాలతో జల్లెడ

రెండ్రోజులుగా పట్టణ పరిసర ప్రాంతాల్లో అనుమానం ఉన్న ప్రాంతాలపై నిఘా ఉంచారు. పగలు, రాత్రి తేడా లేకుండా ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు తిరుగుతుంటే వారిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. దీంతోపాటు గంజాయి, మట్కా, పేకాట, స్థావరాలు సైతం ఎక్కడైనా ఉన్నాయా? అనేకోణంలో విచారిస్తున్నారు. మొత్తం మీద పోలీసు అధికారులు, సిబ్బంది సీరియస్‌గా పనిచేస్తున్నారు.

వైసీపీ వదిలేసిన పనులన్నీ పూర్తిచేస్తాం

- హిందూపురాన్ని ఆదర్శంగా నిలుపుతాం
- ఎమ్మెల్యే బాలకృష్ణ హామీ



తారు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బాలకృష్ణ

చిలమత్తూరు/లేపాక్షి/హిందూపురం అర్బన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల కాలంలో నియోజకవర్గంలో వైసీపీ నిర్లక్ష్యంగా వదిలేసిన పనులన్నీ పూర్తిచేస్తామని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. ఆయన మంగళవారం ఉదయం ప్రెస్‌క్లబ్‌లో మొక్కలు నాటారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మరమ్మతులు చేసిన భవనాన్ని ప్రారంభించారు. లేపాక్షి, చిలమత్తూరు మండలాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల పంపిణీ చేశారు. బ్రహ్మేశ్వరంపల్లిలో వాటర్‌ప్లాంట్ ప్రారంభించారు. చిలమత్తూరు మండలం దిగువపల్లి తాండా తారు రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. హిందూపురంలో రవాణాశాఖ, పోలీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రోడ్డు భద్రతా వారోత్సవంలో పాల్గొని హెల్మెట్ ధరించి గురునాథ్ సర్కిల్ నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు ద్విచక్రవాహనాన్ని నడిపారు. టీడీపీ నాయకులు డైమండ్‌బాబా కుమారుడి వివాహ కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం ఎమ్మెల్యే నివాసం వద్ద అహుడా ఛైర్మన్ టీసీ వరుణ్ ఎమ్మెల్యేను కలిశారు. మునిసిపల్ కమిషనర్ సంఘం శ్రీనివాసులు వివిధశాఖల అధికారులు ఎమ్మెల్యేతో సమావేశమై అభివృద్ధి పనుల గురించి వివరించారు. నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే నివాసం వద్దకు పెద్దఎత్తున తరలి రావడంతో వారిని నివారించడానికి పోలీసులు నానా తంటాలు పడ్డారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పాత్రికేయులు సమాజానికి నిర్దేశకులన్నారు. మంచిని మంచిగా చెడు చెడుగా చూపించాలన్నారు. పాత్రికేయుల సమస్యలు ఏవైనా ఉంటే పరిష్కరిస్తామన్నారు.



దివ్యాంగుడి సమస్యను సావధానంగా వింటున్న ఎమ్మెల్యే

హిందూపురం నియోజకవర్గ ప్రజలకు రుణ పడి ఉంటానన్నారు. మూడోసారి తనను ఎమ్మెల్యేగా గెలిపించిన వారిరుణం తీర్చుకోలేనిదన్నారు. ఈ నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చి దిద్దడమే లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ పట్టణ కన్వీనర్ రమేష్, లేపాక్షి, చిలమత్తూరు మండల కన్వీనర్లు జయప్ప, రంగారెడ్డి, వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ ఆనంద్‌కుమార్, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ పరిమళ, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ గంగాధర్, నాయకులు కోడూరు సోమశేఖర్, గౌరీశంకర్, బాలాజీ, ఎగువింటి శీన, శ్రీదేవి, అశ్వర్థప్ప, లేపాక్షి ఆనంద్, జయచంద్ర, ప్రభాకర్‌రెడ్డి, సిద్దు, రామాంజినమ్మ, చెన్నమ్మ, హిందూపురం నాయకులు అశ్వర్థరెడ్డి, నాగరాజు, బాచి, అమర్నాథ్, మంజునాథ్, టీడీపీ లీగల్‌సెల్ శివశంకర్, రామక్రిష్టారెడ్డి పాల్గొన్నారు.

అన్నక్యాంటీన్ నిర్వహణకు రూ. 2లక్షల విరాళం

హిందూపురం అర్బన్: పేదలకు కడుపునిండా అన్నంపెట్టి ఆకలి తీరుస్తున్న అన్నక్యాంటీన్ నిర్వహణకు ప్రైవేట్ విద్యా సంస్థలు రూ. 2,01,116 విరాళం అందించారు. మంగళవారం ఎమ్మెల్యే నివాసంలో ఆయనకు రూ.2,01,116 చెక్కును అందించారు. ప్రభుత్వం అన్న క్యాంటిన్ ఏర్పాటు చేసి పేదల ఆకలి తీరుస్తున్న తీరు అభినందనీయమని, ఉడతా భక్తిగా తమ వంతు సాయం అందించి ప్రభుత్వాని సహకరించాలని తలచామని ప్రైవేట్ విద్యా సంస్థల హిందూపురం జోన్ అధ్యక్షుడు శ్రీనివాసులు పేర్కొన్నాడు. విద్యా సంస్థల ఉదారతను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో కార్యదర్శి వేణుగోపాల్, కోశాధికారి రియాజ్, వివిధ పాఠశాలల కరెస్పాండెంట్‌లు ఉన్నారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ జరగదు

- టీటీడీ సభ్యుడు, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిర టౌన్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ జరగదని, ఇది కేవలం వైసీపీ దుష్ప్రచారమని టీటీడీ బోర్డు సభ్యుడు, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. శ్రీసత్యసాయి జిల్లా మడకశిరలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామితో కలిసి మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ ఖాయమని వైసీపీ చేస్తున్న ప్రచారంలో ఏమాత్రం వాస్తవం లేదని అన్నారు. ఐదేళ్ల జగన్ పాలనలో విశాఖ ఉక్కుకు ఒక్క రూపాయి తేలేదని, అలాంటి చేతగానివారు ఈ రోజు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. అప్పుల్లో, నష్టాల్లో కూరుకుపోయిన విశాఖ ఉక్కు పరిశ్రమకు అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే కేంద్రం నుంచి నిధులు తెచ్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందని అన్నారు. ఐదు సంవత్సరాలలో విశాఖ ఉక్కును గట్టెక్కించలేని వైసీపీ నాయకులు, మాజీ మంత్రులు జగన్ మీడియా వేదికగా అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖ ఉక్కుకు ఊపిరి పోసేందుకు కేంద్రం నిధులు ఇచ్చిందని, దానిపై కూడా అసత్యప్రచారాలు చేయడం వైసీపీ నేతలకే సాధ్యమని ఎద్దేవా చేశారు. వైసీపీ నాయకుల ద్వంద్వ వైఖరిని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు.

చెరువు సర్వే నంబరుతో రూ.13లక్షల టోకరా

పరిగి, జనవరి 21(ఆంధ్రజ్యోతి):ఊటకూరు చెరువుకు సంబంధించి నాలుగు ఎకరాల భూమిని చూపించి తనకు రూ.13లక్షలు టోకరా వేసినట్లు మంగళవారం ఓ బాధితుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ రంగడు యాదవ్ తెలిపిన వివరాల మేరకు కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన అబ్దుల్ సలీం అనే 68ఏళ్ల వృద్దునివద్ద నుంచి 2016లో ఊటకూరు బసవనపల్లి విజయేంద్రరెడ్డి ఊటకూరు నిస్సార్ సాబ్ అనే ఇద్దరు ఊట కూరు నుంచి మలుగూరుకు వెళ్లే దారిలో చెరువులో 228 సర్వేనంబరు చూపించి ముందస్తుగా టోకన్ నగదు రూ.5లక్షలు తీసుకున్నారు. భూమిని రిజిస్టర్ చేయిస్తామని తిప్పించుకుని రిజిస్టర్ కార్యాలయం బయట నకిలీ రిజిస్టరు చేయించి రూ.8లక్షలు తీసుకుని మోసగించారు. అయితే అబ్దుల్ సలీం సర్వేనంబరు 228లో పూర్తి వివరాలు తెలుసుకోగా అది చెరువు ప్రాంతమని తేలింది. దీంతో అతడు విజయేంద్రరెడ్డి, నిస్సార్‌సాబ్‌లను ప్రశ్నించగా నగదు వాపసు ఇస్తానంటూ నమ్మబలికారు. కాని ఇప్పటిదాకా నగదు ఇవ్వలేదని, మంగళవారం బాధితుడు పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించాడు. బాధితుని ఫిర్యాదు మేరకు విజయేంద్రరెడ్డి, నిస్సార్‌సాబ్‌లపై చీటింగ్ కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

పెనుకొండ రూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మావటూరు గ్రామంలో ఉప్పర గోవిందప్ప(50) అనే వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గత కొన్ని సంవత్సరాలుగా తాగుడుకు బానిసై కడుపునొప్పి తాళలేక జీవితంపై విరక్తిచెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చుట్టుపక్కల కాలనీవాసులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి భార్య నాగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

పెనుకొండ, జనవరి 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రసిద్ధి చెందిన అవిముక్తేశ్వర ఆలయం, చెరువు వద్ద వెలసిన దక్షిణ ముఖ ఆంజనేయస్వామి ఆలయాల్లో మంగళవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి మూలవిగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. అశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఇజ్‌తెమాకు ఏర్పాట్లు చేయండి: మంత్రి సవిత



ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న మంత్రి సవిత

పెనుకొండ టౌన్, జనవరి 21(ఆంధ్రజ్యోతి) : ఫిబ్రవరి 5, 6 తేదీల్లో రైల్వే స్టేషన్ సమీపంలో జరిగే ఇజ్‌తెమాకు అన్ని ఏర్పాట్లు చేయాలని బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత అధికారులను సూచించారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో మంత్రితో ముస్లిం పెద్దలు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సీఐ రాఘవన్, తహసీల్దార్ శ్రీధర్, తదితర అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇజ్‌తెమాకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా విద్యుత్, మంచినీరు, శానిటేషన్, తదితర సౌకర్యాలను కల్పించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జప్రుల్లాఖాన్, షౌకత్, హజురుల్లాఖాన్, ఏజాజ్ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోండి



గుడిబండలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది, విద్యార్థులు

గుడిబండ, జనవరి 21(ఆంధ్రజ్యోతి): వాహనదారులు హెల్మెట్‌లు ధరించి వాహనాలను నడిపి తమ ప్రాణాలను కాపాడుకోవాలని ఎస్ఐ రాజకుల్లాయప్ప పేర్కొన్నారు. జూనియర్ కళాశాల విద్యార్థులు, మంగళవారం వాహనదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వాహనదారులు లైసెన్స్, ఇన్సూరెన్స్, హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనాలను నడపాలన్నారు. ప్రతి ఒక్కరు ద్విచక్ర వాహనంలో వెళ్లే సమయంలో హెల్మెట్ ధరించి ప్రాణాలను కాపాడుకోవాలన్నారు.అనంతరం విద్యార్థులతో కలిసి గుడిబండలో హెల్మెట్ వాడకంపై ర్యాలీ నిర్వహించి బస్టాండులో మానవహారం చేపట్టారు. ఈకార్యక్రమంలో పోలీసు సిబ్బంది మహ్మద్‌రఫీక్, పాతన్న, రామప్ప, జగన్నాథ్‌నాయక్, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ యశ్వంత్‌కుమార్, అధ్యాపకులు చంద్రశేఖర్, నరేష్, సుధాకర్, శివశంకర్‌నాయక్, కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కళాశాలకు కంచాలు, గ్లాసులు వితరణ



ప్రిన్సిపాల్‌కు పళ్లాలు, గ్లాసులు అందజేస్తున్న దాతలు

పెనుకొండ, జనవరి 21(ఆంధ్రజ్యోతి) : స్థానిక జూనియర్ కళాశాలలో విద్యార్థుల మధ్యాహ్న భోజన పథకానికి అవసరమైన 500 కంచాలను బక్కంపల్లి గ్రామానికి చెందిన రఘునాథ్‌రెడ్డి, కాంతమ్మ దంపతులు అందజేశారు. కళాశాలలో పనిచేసే సిరికల్చర్ అధ్యాపకురాలు విజయలక్ష్మీ, ఉమాశంకర్‌లు 400 స్టీల్ గ్లాసులను అందజేసి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. మంగళవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో దాతలు వీటిని ప్రిన్సిపాల్ సుదర్శన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా దాతలను ప్రిన్సిపాల్, అధ్యాపకులు, పూలమాలలువేసి ఘనంగా సత్కరించారు.

ఘర్షణలో ఇరువురికి తీవ్ర గాయాలు

గోరంట్ల,, జనవరి21(ఆంధ్రజ్యోతి) :పట్టణంలోని బస్టాండ్ కూడలి వద్ద మంగళవారం జరిగిన ఘర్షణలో డ్రైవర్ హరినాథ్‌యాదవ్, జగన్‌లు తీవ్రంగా గాయపడ్డారు. గోరంట్లకు చెందిన జగన్ మద్యం సేవించి బస్టాండ్ కూడలిలో గంగాదేవి పల్లికి చెందిన హరినాథ్‌యాదవ్‌తో ఘర్షణ పడ్డాడు. జగన్ బీరుసీసాతో హరినాథ్‌యాదవ్ తలపై కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. తలకు బలమైన గాయం కావడంతో ఆటోలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. హరినాథ్‌యాదవ్ బంధువులు జగన్‌పై దాడిచేసి అతడిని కొట్టడంతో అతడి తలకు గాయమైంది. కేసు దర్యాప్తులో ఉంది.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

పెనుకొండ రూరల్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోనిపేటలో విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదుచేసినట్లు పెనుకొండ ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. గ్రామానికి చెందిన ఓ యువతి సోమందేపల్లిలోని కస్తూరీబా పాఠశాలలో ఇంటర్ చదువుతోంది. అమ్మాయి సంక్రాంతి సెలవుల్లో భాగంగా ఇంటికి వచ్చింది. ఈనెల 18న ఇంటి నుంచి కళాశాలకు వెళ్తానని తల్లిదండ్రులతో చెప్పింది. అయితే కళాశాలకు మాత్రం రాలేదని కరస్పాండెంట్ చెప్పారు. దీంతో తమ కుమార్తె ఆచూకీ తెలపాలని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.